## పట్టుబడిన రూ.94 కోట్లు బీజేపీవే..

బెంగళూరు: ఆదాయం పన్ను శాఖ కర్ణాటకలోని ప్రభుత్వ కాంట్రాక్టర్లు, రియల్ ఎస్టేట్ డవేలపర్ల కార్యాలయాలపై జరిపిన దాడుల్లో పట్టుబడిన రూ. 94 కోట్లు బీజేపీవేనని ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ అన్నారు. పట్టుబడిన సొమ్ముతో కాంగ్రెస్‌కు సంబంధాలున్నాయంటూ బీజేపీ చేసిన ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు. జేపీ నడ్డా సారథ్యంలో బీజేపీ 'అవినీతికి ఫౌండేషన్' అని డీకే అభివర్ణించారు.

'అవినీతి అంతా బీజేపీదే. అవినీతికి ఫౌండేషన్ ఆ పార్టీ. ఆ కారణంగానే ఆ పార్టీని కర్ణాటక ప్రజలు గెంటివేశారు. పట్టుబడిన సొమ్ముకు బీజేపీ నేతలతో సంబంధాలున్నాయి. కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి సంబంధం లేదు" అని డీకే మీడియాతో మాట్లాడుతూ చెప్పారు.

Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 270 మేడ్చల్ మల్కాజ్‌గిరి 19 అక్టోబర్ 2023 గురువారం పేజీలు : 4

# తెలంగాణను పుణ్యానికి ఇవ్వలేదు..

## చావు నోట్లో తలకాయ పెడితే తప్ప రాష్ట్రం రాలేదు

## జడ్చర్ల ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్



మహబూబ్‌నగర్ : తెలంగాణను మనకు ఎవరూ పుణ్యానికి ఇవ్వలేదు.. అనేక మందిని బలి తీసుకుని విద్యార్థులను చావగొట్టి, అనేక మందిని బాధపెట్టి, చివరకు నేను కూడా ఆమరణ దీక్ష పట్టి చావు నోట్లో తలకాయ పెడితే తప్ప తెలంగాణ రాలేదు అని సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు. ఎవడో ఇవ్వలేదు మనకు.. పుణ్యానికి ఇచ్చిపోలేదు మనకు తెలంగాణను అని కేసీఆర్ పేర్కొన్నారు. జడ్చర్ల నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత కృష్ణా జలాల్లో మన హక్కు రావాలని పరిశోధన చేశామని కేసీఆర్ తెలిపారు. అంతకుముందు ఉన్న కాంగ్రెస్ ముఖ్యమంత్రులు, ఇక్కడున్న కాంగ్రెస్ దద్దమ్మ ఎమ్మెల్యేలు.. వారికి నోరు లేక, అడగలేక జూరాల నుంచి నీళ్లు తీసుకోమని ఇచ్చారు. జూరాల బెత్తడు ప్రాజెక్టు. దాంట్ల నీళ్లు ఉండేదే 9 టీఎంసీలు. మనం తీసుకునేది 2 టీఎంసీలు ఒక దినానికి. అలా తీసుకుంటే మూడు రోజులకు ఖతం అయిపోతది. మళ్లా నీళు ఎక్కడ్నుంచి తీసుకోవాలి. మళ్లా ఒక్కసారి గోల్ మాల్ చేయడానికి ఆంధ్రా ముఖ్యమంత్రులు జూరాల నుంచి సోర్స్ అని పెట్టారు. నేను చెప్పిన దాన్ని ఎందుకు తీసుకుంటం.. నాకర్థం కాదు అని ప్రశ్నించాను. శ్రీశైలం వాని అయ్య జాగీరా..? దాంట్ల మన పైసలు లేవా..? బాజాప్తా శ్రీశైలం నుంచే తీసుకోవాలని చెప్పి.. నేను అధికారులందరికీ చెప్పి పాలమూరు ఎత్తిపోతల పథకం యొక్క సోర్స్‌ను జూరాల నుంచి శ్రీశైలంకు మార్చాం. ఇప్పుడున్న కాంగ్రెస్ నేతలకు తెలివి లేదు. ఈ జిల్లాలో ఎట్ల పుట్టారో కూడా తెల్వదు. వాళ్లు మాట్లాడుతారు ఇప్పుడు కూడా.. జూరాల నుంచే తీసుకోవాల్సి ఉండే అని.. సిగ్గుపడాలి.. మీకు ఏమన్నా తెలివి ఉన్నదా..? జూరాలలో నీళ్లు ఎన్ని ఉన్నాయో తెలుసా.? ఎన్ని రోజులకు వస్తాయో తెలుసా..? అంటే ఆ రోజు భావదారిద్రమే.. ఉద్యమం చేస్తుంటే భావదారిద్రమే.. ఇవాళ కూడా అదే భావదారిద్రమే అని కేసీఆర్ నిప్పులు చెరిగారు.

**60 ఏండ్లు గోసపడ్డాం.. సర్వనాశనం అయిపోయాం..** ఇవాళ ప్రతి ఒక్కరూ గుండె మీద చేయి వేసుకుని ఆలోచించాలి.. నేను చెప్పే మాట గంభీరమైన మాట అని కేసీఆర్ అన్నారు. చిన్న పొరపాటు జరిగింది 1956లో. చాలా చిన్నపొరపాటు.. మనల్ని తీసుకెళ్లి ఆంధ్రాలో కలిపేశారు. 60 ఏండ్లు గోస పడ్డాం. సర్వనాశనం అయిపోయాం. ముంబై బస్సులకు పాలమూరు ఆలవాలమైంది. తాలుకాలకు తాలుకాలు ఖాళీ అయ్యాయి. లంబాడీ బిడ్డలు హైదరాబాద్‌కు ఇంకో చోటకు బతుకపోయిన పరిస్థితి. ఆనాడు మనం కండ్లారా చూశాం. బాధలు పడ్డాం అని కేసీఆర్ తెలిపారు.

**ఉన్న తెలంగాణను ఊడగొట్టింది కాంగ్రెస్సే..** గోరెటి వెంకన్న ఇదే జిల్లా కవి.. పల్లె పల్లెలో పల్లేర్లు మొలిచే పాలమూరులోనా అని పాటలు రాశారు అని కేసీఆర్ గుర్తు చేశారు. పల్లె పల్లెల్లో పల్లేర్లు మొలవాల్నా..? మన జీవితం అదేనా..? దానికోసమే పుట్టామా అని ఆనాడు పిడికిలి ఎత్తి పోరాటం చేస్తే మీరందరూ దీవెన ఇస్తే, అందరం కలిసి కొట్లాడితే తెలంగాణ వచ్చింది. తెలంగాణను మనకు ఎవరూ పుణ్యానికి వ్వలేదు. అనేక మందిని బలి తీసుకుని విద్యార్థులను చావగొట్టి, అనేక మందిని బాధపెట్టి, చివరకు నేను కూడా ఆమరణ దీక్ష పట్టి చావు నోట్లో తలకాయ పెడితే తప్ప తెలంగాణ రాలేదు. ఎవడో ఇవ్వలేదు మనకు.. పుణ్యానికి ఇచ్చిపోలేదు మనకు. ఉన్న తెలంగాణను ఊడగొట్టింది కాంగ్రెస్ పార్టీ.. 60 ఏండ్లు మనల్ని గోసపెట్టింది కాంగ్రెస్ పార్టీ అని సీఎం ధ్వజమెత్తారు.

**కరువు అనేది మనదిక్కు కన్నెత్తి కూడా చూడదు..** మనం పాలమూరు ఎత్తిపోతల ప్రారంభించుకున్నాం.. దానికి మళ్లా ఎవడు అడ్డం.. ఇదే జిల్లాలో పుట్టిన దరిద్రులు, కాంగ్రెస్ నాయకులు పోయి కేసులు వేస్తరని కేసీఆర్ మండిపడ్డారు. అది కావొద్దు.. అది అయితే లక్ష్మారెడ్డికి, శ్రీనివాస్ గౌడ్‌కు పేరు వస్తది.

కేసీఆర్‌కు పేరు వస్తదని అడ్డు పడుతున్నారు. మొండిపట్టుతో పోయాం. ఈ మధ్యనే.. 9 సంవత్సరాల పోరాటం తర్వాత అనుమతులు వస్తున్నాయి. ధర్మం గెలుస్తది. న్యాయం గెలుస్తది. నార్లాపూర్, ఏదుల, వట్టెం, కరివెన, ఉద్దండపూర్ రిజర్వాయర్లు పూర్తయ్యాయి. మోటార్లు బిగిస్తున్నారు. మూడు నాలుగు నెలల్లో నీళు చూడబోతున్నాం. పాలమూరు కరువు పోతది. ఉద్దండపూర్ పూర్తయితే.. జడ్చర్ల సస్యశ్యామలం అవుతుంది. జడ్చర్లలో లక్షా 50 వేల ఎకరాలకు నీళ్లు వస్తాయి. కరువు అనేది మనదిక్కు కన్నెత్తి కూడా చూడదు. సస్యశ్యామలం కాబోతుంది అని కేసీఆర్ తెలిపారు.





## పొత్తుపై కాంగ్రెస్‌కు కమ్యూనిస్టులు డెడ్ లైన్!

హైదరాబాద్: పొత్తుపై కాంగ్రెస్‌కు కమ్యూనిస్టులు డెడ్ లైన్ విధించారు. మునుగోడు సీటు కచ్చితంగా తమకే కేటాయించాలని సీపీఐ పట్టుబడుతోంది. కొత్తగూడెం, వైరా, మునుగోడు, బెల్లంపల్లి, హుస్నాబాద్ సీట్ల ఇవ్వాలని సీపీఐ కోరింది. ఇదిలా ఉంటే సీపీఐకు చెన్నూరు, కొత్తగూడెం సీట్లను కాంగ్రెస్ ఆఫర్ చేస్తోంది. చెన్నూరులో తమకు క్యాడర్, లీడర్ లేదని సీపీఐ అంటోంది. దీంతో ఈ వ్యవహారం సందిగ్ధంలో పడింది. ఇక సీపీఎం.. భద్రాచలం, పాలేరు, ఇబ్రహీంపట్నం, మిర్యాలగూడ, ఖమ్మం సీట్లను అడుగుతోంది. ఇప్పటికే భద్రాచలంలో సిట్టింగ్ ఎమ్మెల్యే పోదెం వీరయ్యను అభ్యర్థిగా కాంగ్రెస్ ప్రకటించింది. దీంతో కనీసం మిర్యాలగూడ, ఇబ్రహీంపట్నం సీట్లైనా ఇవ్వాలని సీపీఎం పట్టుబడుతోంది. ఎన్నికల సమయం దగ్గర పడుతుండంతో ఏదొకటి తేల్చుకోవాలని కమ్యూనిస్టు పార్టీలు భావిస్తున్నాయి. ఇందుకోసం కాంగ్రెస్‌తో పొత్తు అంశం తేల్చే బాధ్యతను నారాయణకు సీపీఐ బాధ్యతలు అప్పగించింది.

## గంగుల మీద పోటీ అంటే పోషమ్మ గుడి ముందు పొట్టేలు కట్టేసినట్టే : మంత్రి కేటీఆర్



కరీంనగర్ : మంత్రి గంగుల కమలాకర్ మీద పోటీ అంటే పోషమ్మ గుడి ముందు పొట్టేలు కట్టేసినట్టే అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. కరీంనగర్ ఎమ్మెల్యేగా గంగులను భారీ మెజార్టీతో గెలిపించి, మరోసారి తెలంగాణలో కేసీఆర్‌కు అవకాశం ఇవ్వాలని మంత్రి కోరారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో ఈ పదేండ్లలో ఎంతో అభివృద్ధి చేసుకున్నామని కేటీఆర్ తెలిపారు. మానేరు నీళ్లకోసం జరిగిన కొట్లాటలు ఇంక కళ్లముందే ఉన్నాయి. నేడు ఆ పరిస్థితి లేదు. కాళేశ్వరంతో కరీంనగర్ జిల్లా అంత సజీవ జలధారగా మారిందన్నారు. అభివృద్ధికి తోడు సంక్షేమం ధీటుగా సాగుతుందన్నారు. కమలాకర్ నాయకత్వంలో బీసీ సంక్షేమం అద్భుతమైన ప్రగతి సాధించిందని తెలిపారు. చదువుకునేందుకు గురుకులాలు, విదేశాలకు పోయేవాళ్ళకి కూడా ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లు అందించి అండగా నిలబడ్డామని చెప్పారు. హిందూ, ముస్లింల మధ్య కొట్లాటలు పెట్టే సన్నాసులు కరీంనగర్‌లో ఉన్నారని కేటీఆర్ ధ్వజమెత్తారు. కమలాకర్ చేతిలో చావు దెబ్బ తిని దొంగ ఏడుపుతో ఎంపీ అయ్యారని విమర్శించారు. ఎంపీ అయ్యాక కరీంనగర్‌కు ఏం చేశారు. ఓ బడి తేలేదు%ో% కనీసం గుడి అయినా తేలేదని మండిపడ్డారు. కమలాకర్ అన్నపై పోటీ చేసేందుకు అందరూ జంకుతున్నారు. కాంగ్రెస్ వాళ్లు హుస్నాబాద్ పారిపోయారు.. బీజేపీ వాళ్ళు పోటీకి వెనుక ముందు అవుతున్నారు. కేసీఆర్ అందరి నాయకుడు.. హిందూ, ముస్లింలకు అందరికీ నేత అని స్పష్టం చేశారు. కేసీఆర్ అందరి కంటే గొప్ప హిందువు.. యాగాలు, యజ్ఞాలు చేశారని తెలిపారు. ఇక్కడ ఎంపీ మసీదులు తవ్వుదాం అంటాడు%ో% బొందల గడ్డలు తవ్వడానికా ఎంపీ అయింది సంజయ్ అని కేటీఆర్ నిలదీశారు. పునాదులు తవ్వండి.. అభివృద్ధి కోసం పునాదులు వేయండి అని పిలుపునిచ్చారు. చావు నోట్లో తలపెట్టిన కేసీఆర్ ఒకవైపు%ో% తెలంగాణ కోసం రాజీనామా చేయకుండా పారిపోయిన బీజేపీ కిషన్ రెడ్డి, ఓటుకు నోటు దొంగ థర్డ్ క్లాస్ క్రిమినల్ రేవంత్ రెడ్డి మరోవైపు ఉన్నారని కేటీఆర్ తెలిపారు. రాహుల్ వస్తాడు.. ప్రియాంక వస్తుంది.. మోసపోకండి కారు గుర్తుకు ఓటేసి కేసీఆర్‌ని దీవించండి అని కరీంనగర్ ప్రజలకు కేటీఆర్ పిలుపునిచ్చారు.




# అయిదు రాష్ట్రాల్లో...

# కాంగ్రెస్‌దే హవా!

## విజయం పక్కా అంటున్న టైమ్స్ ఆఫ్ ఇండియా

దేశంలో జరగనున్న అయిదు రాష్ట్రాల ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుంది అని టైమ్స్ ఆఫ్ ఇండియా గట్టిగా చెబుతోంది. ఈ మేరకు తన దగ్గర ఉన్న అంచనాలను బయటపెడుతోంది. 2018లో జరిగిన ఎన్నికల్లో ఈ అయిదు రాష్ట్రాలలో కాంగ్రెస్ ఎక్కువ సీట్లను ఓట్లను గెలుచుకుంది అని గుర్తు చేస్తోంది. అప్పటికీ ఇప్పటికీ మారిన పరిస్థితుల నేపథ్యం నుంచి చూసుకున్నపుడు మరోసారి కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుందని కూడా ధీమాగా చెబుతోంది.

రాజస్థాన్, మధ్యప్రదేశ్, చత్తెస్ ఘడ్ లలో మొత్తం అసెంబ్లీ సీట్లు 520 ఉన్నాయని, ఇందులో నుంచి 2018లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ 282 సీట్లను గెలుచుకుంది అని టైమ్స్ ఆఫ్ ఇండియా చెబుతోంది. అలా గెలుపు శాతం తీసుకుంటే 54.2 ఉందని అంటోని. దక్షిణాదిన ఉన్న తెలంగాణాతో పాటు మిజోరామ్ కలుపుకుని మొత్తం చూస్తే 683 సీట్లు అవుతాయి. ఇందులో 2018లో కాంగ్రెస్ గెలుచుకున్న సీట్లు 305గా ఉన్నాయి. బీజేపీ ఇందులో 199 సీట్లను మాత్రమే గెలుచుకుంది. అంటే ఈ రెండు పార్టీల మధ్య వ్యత్యాసం చాలానే ఉంది అని టైమ్స్ ఆఫ్ ఇండియా చెబుతోంది. ఇపుడు పరిస్థితి ఈ అయిదు రాష్ట్రాలలో కాంగ్రెస్ కి బాగా మారింది అని అంటోంది. గతానికి కంటే మంచి పెర్ఫార్మెన్స్ కాంగ్రెస్ చేయనుంది అని అంటోంది. అందువల్ల కచ్చితంగా ఈ అయిదు రాష్ట్రాలలో కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుంది అని టైమ్స్ ఆఫ్ ఇండియా తన అంచనాను బయటకు తెచ్చింది.

టైమ్స్ ఆఫ్ ఇండియా అంచనా మేరకు ఈ అయిదు రాష్ట్రాలలో బీజేపీ గట్టిగా పోరాడాల్సి ఉంటోంది అని అంటున్నారు. మధ్యప్రదేశ్ లో బీజేపీ కంటే కాంగ్రెస్ కే ఎక్కువ సీట్లు వస్తాయని పలు సర్వేలు ఇప్పటికే చెప్పేసాయి. రాజస్థాన్ లో కాంగ్రెస్ మరోసారి అధికారాన్ని నిలబెట్టుకోవడానికి హోరా హోరీ పోరు సాగించనుంది. చత్తీస్ ఘడ్ లో బీజేపీకి మళ్లీ ఓటమి తప్పదని తేలుతోంది. తెలంగాణాలో చూస్తే బీయారెస్ కాంగ్రెస్ ల మధ్యనే పోరు సాగుతోంది. బీజేపీ అక్కడ మూడవ ప్లేస్ కే పరిమితం కానుంది.

మిజోరాం లో కాంగ్రెస్ కి బలం ఉంది, ప్రాంతీయ పార్టీ మిజో నేషనల్ ఫ్రంట్ తో పోటీ పడుతోంది. ఈ దఫా ఓటర్లు కాంగ్రెస్ కి పట్టం కట్టవచ్చు అన్న అంచనాలు కనిపిస్తున్నాయి. అలా చూసుకుంటే ఈ అయిదు రాష్ట్రాలలో హస్తవాసి బాగానే ఉంటుంది అని అంటున్నారు. రాహుల్ గాంధీ కూడా అదే ధీమాను వ్యక్తం చేస్తున్నారు. మేము గెలిచి తీరుతాం చూడండి అని ఆయన అంటున్నారు. డిసెంబర్ 3న ఫలితాలు వస్తాయి. అవి దేశ రాజకీయ ముఖ చిత్రాన్ని మార్చనున్నాయని అంటున్నారు.

# సంపాదకీయం

## ఆ డబ్బంతా తెలంగాణ కోసమా?

కర్ణాటక రాష్ట్ర రాజధాని బెంగళూరులోని ఒక కాంగ్రెస్ నేత ఇంట్లో లభించిన భారీ నగదు సంచలనంగా మారింది. ఒకటి కాదు.. రెండు కాదు ఏకంగా రూ.42 కోట్ల భారీ మొత్తాన్ని అధికారులు గుర్తించి.. సీజ్ చేయటం తెలిసిందే. ఈ ఉదంతంపై స్పందించారు గులాబీ పార్టీ ట్రబుల్ షూటర్ కమ్ మంత్రి హరీశ్ రావు. కర్ణాటకలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమంగా బిల్డర్ల నుంచి కాంట్రాక్టర్ల నుంచి బిజినెస్ చేసే వారి నుంచి భారీ ఎత్తున కలెక్షన్లు చేస్తున్నట్లుగా ఆరోపించారు. కాంట్రాక్టర్ల నుంచి బంగారం.. బిజినెస్ చేసే వారి నుంచి రూ.1500 కోట్లు వసూలు చేసినట్లుగా ఆరోపించారు. ఈ భారీ మొత్తాన్ని తెలంగాణలో జరుగుతున్న ఎన్నికల్లో ఖర్చు చేయాలన్న ప్లానింగ్ జరుగుతుందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని అభ్యర్థులకు పంపిణీ చేసేందుకు వీలుగా బెంగళూరులోని ఒక కాంగ్రెస్ నేత ఇంట్లో సిద్ధం చేసినట్లుగా సీరియస్ ఆరోపణలు చేశారు. కర్నాటకలో అంతకు ముందున్న బీజేపీ ప్రభుత్వం.. కాంట్రాక్టర్ల నుంచి కమీషన్ల రూపంలో 40 శాతం తీసుకునే వారని.. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రం 40 శాతాన్ని 50 శాతంగా మార్చిందని పేర్కొన్నారు. ఈ ధనాన్ని బెంగళూరు నుంచి చెన్నైకు.. అక్కడి నుంచి హైదరాబాద్ కు తరలించాలన్నదే ప్లాన్ గా చెప్పుకొచ్చారు. తాజాగా జరుగుతున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు ఈ భారీ మొత్తాల్ని పంపిణీ చేయాలన్నదే ప్లానింగ్ అంటూ తీవ్ర ఆరోపణలు చేశారు హరీశ్. బీజేపీ నాయకులు 40 శాతం కమిషన్లు తీసుకుంటున్నారని ఆరోపించిన అంబికా పతి ఇంట్లోనే ఇంత భారీగా డబ్బులు దొరకటాన్ని హరీశ్ ప్రశ్నించారు. కర్ణాటకలో జరిగే ప్రతి నిర్మాణంలోనూ.. ప్రతి చదరపు అడుగు నిర్మాణానికి 75 రూపాయిల చొప్పున కాంగ్రెస్ పార్టీ పన్నుగా వసూలు చేస్తున్నట్లుగా హరీశ్ ఆరోపించారు. కర్ణాటక మొత్తం అవినీతిమయమైనట్లుగా మండిపడ్డ మంత్రి.. అక్కడి వసూళ్లను తెలంగాణలో ఖర్చు చేసి.. అధికారంలోకి రావాలన్నదే కాంగ్రెస్ ఆలోచనగా చెప్పుకొచ్చారు. మరి.. దీనికి కాంగ్రెస్ ఏ రీతిలో రియాక్టు అవుతుందో చూడాలి. ఒకవేళ.. హరీశ్ ఆరోపించినట్లుగా తెలంగాణలో జరుగుతున్న ఎన్నికల ఖర్చు కోసమే ఈ భారీ మొత్తాన్ని సిద్ధం చేస్తున్నారన్న దానికి సంబంధించిన బలమైన ఆధారాలు లభిస్తే మాత్రం.. కాంగ్రెస్ కు కోలుకోలేనంత దెబ్బ తగలటం ఖాయమంటున్నారు. మరేం జరుగుతుందో చూడాలి.

# ఎక్సైజ్ అధికారులా మజాకా!

భద్రాచలం : జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు విన్పిస్తున్నాయి. ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి వి.శ్రీనివాసగౌడ్, రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సహా పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో అట్టహాసంగా నాటించిన మొక్కలు 20రోజులైనా గడవకముందే మాయమయ్యాయి. ఘనత వహించిన ఎక్సైజ్ అధికారులే పదిరోజులు తిరగకుండానే ఆమొక్కలను తొలగించి తరలించుకుపోయారనే విమర్శలున్నాయి. మొక్కలు నాటించిన విధానంపైనే ఎక్సైజ్ అధికారులే అభాసుపాలయ్యారు. ఆ తర్వాత జరిగిన తతంగం వారి పనితీరుపై వచ్చిన విమర్శలు నిజమయ్యాయి.

గతనెల 13న మంత్రులు శ్రీనివాసగౌడ్, అజయ్‌కుమార్ పర్యటించారు. వైరా రిజర్వాయర్‌లో స్పీడ్ బోటును ప్రారంభించారు. రిజర్వాయర్ ఆనకట్ట పైభాగంలో ఎక్సైజ్‌శాఖ మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఏర్పాటుచేసింది. మొక్కల కోసం ఎంపిక చేసిన స్థలం రిజర్వాయర్ పటిష్టతకు హానికరంగా ఉందనే విమర్శలొచ్చాయి. అయినప్పటికీ ఎక్సైజ్ అధికారులు, ఇద్దరు మంత్రులు, ఎమ్మెల్యే రాములునాయక్, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, కలెక్టర్ గౌతమ్ సహా పలువురు అధికారులతో మొక్కలు నాటించారు. వీటిపైనే సర్వత్రా విమర్శలొచ్చాయి. వాటిని పోషించి రక్షిస్తారని అందరూ భావించారు. అయితే అందుకు విరుద్ధంగా నాటిన పదిరోజుల తర్వాత ఎక్సైజ్‌శాఖ వారే ఆమొక్కలను పీకివేసి బయటకు తరలించుకుపోయారు. ప్రస్తుతం మొక్కలు నాటి పీకేసిన తర్వాత మిగిలిన గుంతలు మాత్రం దర్శనమిస్తున్నాయి. మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులను సైతం అవమానించి పక్కదారి పట్టించి అభాసుపాలుచేసిన ఎక్సైజ్ అధికారులపై తగు చర్యలు తీసుకొని భవిష్యత్‌లో ఇలాంటివి జరుగకుండా తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# అంచనా తప్పిందా?



భద్రాచలం : సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో ఉన్న ఏకైన భూగర్భ గని కొండాపురం అండర్ గ్రౌండ్‌మైన్ మూసివేతకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. పగిడేరు పంచాయతీ శివారు అటవీ ప్రాంతంలో దాదాపు 477 హెక్టార్లల్లో సెమీ మెకనైజేషన్ విధానం ద్వారా 2015 లో ఈ గనిని ప్రారంభించారు. 21ఏళ్ల కాలపరి మితితో ఈ గని రూపకల్పన చేశారు. ఏరియాలోనే మేలైన ఎఫ్-6 గ్రేడ్ బొగ్గు ఇందులో లభ్యమవుతుందని సుమారు రూ.20 కోట్లను ఖర్చుచేసి ఈ గని ఏర్పాటు చేశారు. అయితే సాంకేతిక కారణాల వల్ల యాజమాన్యం ప్రస్తుతం ఈ గనిని మూసివేసే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. గనిలో ఉత్పత్తయ్యే బొగ్గు మేలురకానిదే అయినా గని బౌగోళిక పరిస్థితులు ఇందుకు సహకరిం చకపోతుం డటంతో ఉత్పత్తి అనితర సాధ్యంగా మారినట్లు తెలిసింది. ఓసీ గనుల మధ్య ఉన్న ఈ యూజీ గనికోసం కంపెనీ కోట్ల రూపాయాలను వెచ్చించింది. ఈ గని ద్వారా ఎక్కు వ మంది కార్మికులకు ఉపాధిని కల్పించా లన్న లక్ష్యంతో మణుగూరు ఏరియా నుంచి గతంలో గోదావరిఖని, భూపాల పల్లి, వంటి సుదూర ప్రాంతాలకు బదిలీ అయిన కార్మికులను నాడు ఉద్యమాలు నిర్వహిం చిన కార్మిక సం ఘాల ఒత్తిడి మేరకు తిరిగి ఇక్కడికి తీసుకువచ్చి ఉపాదిని చూపారు. అయితే ఈ గని ప్రారంభించిన నాటి నుంచి అనేక అవాంతరాలు ఎదుర వుతూనే ఉన్నాయి. ప్రధాన గని పైభాగాన గొర్రెపేట వాగు ఉండటం వల్ల దాని మళ్లింపునకు సింగరేణి లక్షలాది రూపాయలు ఖర్చు చేసింది. వాగులోని నీరు వర్షాకా లంలో భూపొర ద్వారా గనిలోకి ఇంకే ప్రమాదం ఉండడంతో యాజ మాన్యం దీనికి ఎన్నో ప్రత్యామ్నాయ ఏర్పా ట్లు చేసింది. వాగును మళ్లించేందుకు భగీరథ ప్రయత్నం చేసి వాగు దారి మళ్లించారు. గనిలో కూడా పలుచోట్ల పైపులైన్లు వేశారు. ఈ గనిలో ఓబీ పనుల నిర్వహణ మొదటి నుంచి ఎస్‌ఎంఎస్ అనే కంపెనీ చేపడుతున్నా ప్రస్తుతం సూ చించిన పని పదేశాల్లో ముందుకు సాగలేని పరిస్థితులు నెలకొన్నట్లు సమాచారం. దాంతో బండలను తొలగిచడం ఇక తమవల్ల కాదని సదురు కంపెనీ నిర్వాహ కులు చే తులెత్తేసినట్లు సమాచారం. ఈ క్రమంలోనే తమకు సం బంధించిన సామగ్రి, యంత్రాలను కూడా గని బయటికి తరలిస్తున్నట్లు విశ్వనీయ సమాచారం. ఈ విషయంపై సింగరేణి అధికారులు రెండు నెలలుగా తర్జన భర్జన పడుతున్నారు. గనిలో అంచనాలకు మించి బండలు ఎస్ఎస్ఎం కంపెనీ నిర్వాహకులకు పనిప్రదేశాల్లో ఎదు రైన బండలను తొలచడం సాధ్యం కావడం లేదని తెలు స్తోంది. సర్వేలో చూపిన దానికంటే ఇంకా ఎక్కువ లోతుకు వెళ్లినా బండనే ఉంది తప్ప బొగ్గు పొరలు కనిపిం చడం లేదని సమాచారం. దీంతో ఆ కంపెనీ తమ ఒప్పం దాల ప్రకారం మాత్రమే పనులు సా?గించి చివరికి చేసేదే మీ లేక తపుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే తమ యంత్రాలన్నీ బావి నుంచి బయ టికి తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. ప్రణాళికా లోపంతో రూ.కోట్లు వృథా21 ఏళ్ల కాలపరిమితితో ప్రణాళికలు రూపొందించిన ఈ గని అంచనాలు తప్పినట్లు అనుమానాలు వ్యక్తమవుతు న్నాయి. కోట్ల రూపాయలు ఖర్చు చేసినా ఎందుకు ఫలి తం దక్కలేదన్న విషయంపై చర్చ జరుగుతోంది. గనిలో బొగ్గు పొరలపై అధికారుల నివేదికలు సరిగా లేవన్న అ నుమానాలు స్థానికంగా వ్యక్తమవుతు న్నాయి. లేకపోతే ఉన్న ఏకైన భూగర్భగనిని మూసివేసి ఓపెన్‌కాస్టుపై దృష్టి పెట్టే ఆలోచనలో సింగరేణి అధికారులు ఉన్నారా అన్న అ నే విషయంపై కూడా చర్చ జరుగుతోంది. పొరపాటు ఎ క్కడ జరిగిందనే విషయం మాత్రం అంతా గోప్యత పా టిస్తున్నారు. ఇదిలా ఉండగా ఈ యూజీమైన్ ఓసీగా రూ పాంతరం చెందితే కార్మికుల భవితవ్యం ఏంటనేది ప్ర శ్నార్థకంగా మారింది. ఓసీల్లో అంతా యంత్రాలపై ఆధా రపడి ఉత్పత్తి తీసే పరిస్థితులు ఉంటే ఇక్కడి కార్మికులను ఎక్కడికి బదిలీ చేస్తారనే విషయమై కార్మిక వర్గంలో ఇప్ప టి నుంచే ఆందోళన మొదలైంది. ఏది ఏమైనా జరిగిన పొరపాట్లకు ఎవరు బాధ్యత వహిస్తారు. కోట్లాది రూపా యల సింగరేణి ధనం వృధాపై అధికారులు ఏం చెబుతా రనే దానిపై ప్రస్తుతం ఆసక్తి నెలకొంది.

# రుణాల కోసం ఎదురుచూపులు

నిర్మల్ : సామాజికంగా, ఆర్థికంగా వెనకబడిన ఎస్సీ కులాలను ఆదుకునేందుకు ప్రభుత్వం అమలు చేస్తు న్నసంక్షేమ పథకాలు ఆచరణలో అమలుకు నోచుకోవడం లేదన్న ఆరోపణలు వె ల్లువెత్తుతున్నాయి. అట్టహాసంగా ప్రకటించిన దళితబస్తీ పథకం కనీసస్థాయిలో కూడా నిరుపేద ఎస్సీలకు లబ్ధిచేకూర్చలేదన్న ఫి ర్యాదులున్నాయి. పేదఎస్సీ కుటుంబానికి దళితబంధు కింద మూడు ఎకరాల భూమిని కేటాయించి ఆ భూమిని సాగుకు యోగ్యంగా తీర్చిదిద్దే బాధ్యతను కూడా ప్రభుత్వమే చేపట్టింది. అయినప్పటికీ ఆ పథకం కేవలం కొంతమందికి మాత్రమే వర్తింపజేసి క్షేత్రస్థాయిలోని భూసేకరణ పరిస్థితులు ఎప్పటికప్పుడు నిధుల కేటాయింపు జరగకపోవడం లాంటివి ఈ పథకాన్ని నీరుగార్చయన్న అభిప్రాయాలున్నాయి. అయితే ఓ వైపు ఈ పథకంపై నీలినీడలు కమ్ముకోగా మరోవైపు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా దళితబందు పథకాన్ని తెరపైకి తెచ్చింది. ప్రతిదళిత కుటుంబానికి రూ.10 లక్షల చొప్పున అందించనున్నట్లు ప్రకటించింది. దీని కోసం గానూ ప్రతి నియోజకవర్గంలో వందమంది చొప్పున లబ్ధిదారులను ఎంపిక చేశారు. అయితే ఈ పథకంకు సంబంధించిన పూర్తిస్థాయి నిధులు మంజూరు కావ డం లేదు. ఈ పథకాలన్నింటినీ అమలు చేయాల్సిన ఎస్సీ కా ర్పొరేషన్ ప్రతీ యేటా నిధుల కొరతతో సతమతమవుతోంది. ప్రధానంగా ఎస్సీ కులాల వారికి ఉపాధి కల్పించేందు కోసం చేపట్టిన రుణాల పంపిణీ పథకం నిధుల కొరత కారణంగా నీరుగారిపోతోందంటున్నారు. రుణాల కోసం గత ఏడెనిమిదేళ్ల నుంచి వందలాది మంది ఎస్సీలు ఎస్సీ కార్పోరేషన్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ప్రతియేటా రుణలక్ష్యానికి అనుగుణంగా ఎస్సీ కార్పోరేషన్ అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించడం పరిపాటిగా మారింది. అయితే దరఖాస్తులు చేసుకున్న వారు రుణాల కోసం ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయం చుట్టూ తిరుగుతూ ఆలిసిపోతున్నారు. ప్రతీయేటా ఇలాంటి తంతు సంబంధిత అధికారులకు తలవంతపులు తెస్తోందంటున్నారు. అయితే మంజూరులు ఘనంగా ఉంటున్నప్పటికి నిధుల విడుదల విషయంలో తాత్సరం జరుగుతుండడం విమర్శలకు తావిస్తోంది. 2014 - 2015 నుంచి మొదలుకొని ఇప్పటి వరకు వేలాది మంది రుణాల కోసం దరఖాస్తులు చేసుకోగా వీరిలో కొంతమందికి మాత్రమే రుణాలు అందిస్తున్నట్లు చెబుతున్నారు. ఓ ఆర్థిక సంవత్సరంలో దరఖాస్తులు చేసుకున్న వారి దరఖాస్తులను వచ్చే సంవత్సరం కోసం పార్వార్డ్ చేయడం రివాజుగా మారిందంటున్నారు. కాగా 2020 -2021 సంవత్సరంలో మొత్తం రుణాల బడ్జెట్ 5.04కోట్లు కాగా వీటిలో నుంచి కొద్ది మందికి కూడా రుణాలు అందలేదంటున్నారు. నైపుణ్యం లేని పనులకు 2.52 కోట్లు కేటాయించగా, నైపుణ్యంతో కూడిన పనులకు కూడా 2.52 కోట్లను కేటాయించారు. అయితే నైపుణ్యం ఉన్న పనుల ఉపాధి కోసం 1750 మంది దరఖాస్తులు చేయగా ఇందులో నుంచి కేవలం 24 మందిని మాత్రమే ఎంపిక చేయడం నిధుల కొరత తీవ్రతను వెల్లడిస్తోందంటున్నారు. ఇంతమంది కోసం 71.34 కోట్లను మంజూరు చేయాల్సి ఉండగా ప్రభుత్వం కేవలం ఈ ఏడా ది టార్గెట్ పేరిట 2.52 కోట్లను మాత్రమే కేటాయించింది. దీంతో మిగతా దరఖాస్తులన్నింటినీ రాబోయే ఆర్థిక సంవత్సరం కోసం ఫార్వార్డ్ చేసి సంబంధిత అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. ఇదిలా ఉండగా ఇప్పటి కే ప్రతిపక్షాలు, దళిత సంఘాల బాధ్యులు పేదలకు రుణాలు అందించే విషయంలో చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నీరుగారిన దళితబస్తీనిరుపేద ఎస్సీ కుటుంబాలను ఆదుకునేందుకు అమలు చేసిన దళిత బస్తీ పథకం ఆఛరణలో నీరుగారిపోయిన సంగతి తెలిసిందే. నిర్మల్ జిల్లాలో ప్రతియేటా దళిత బస్తీ కోసం చాలా కుటుంబాలు ఎస్సీ కార్పోరేషన్‌కు దరఖాస్తులు చేసుకున్నాయి. అయితే వీరిలో నుంచి ఒకరిద్దరికి మాత్రమే భూములు పంపిణీ చేసి మిగతా వారి దరఖాస్తులను చెత్తబుట్టలో పాడేస్తున్నారన్న విమర్శలున్నాయి. ప్రభుత్వం క్షేత్రస్థాయి పరిస్థితులు, ఆచరణకు సంబంధించిన అంశాలను పరిగణలోకి తీసుకోకపోవడంతో దళితబస్తీ కోసం భూముల కొనుగోలు వ్యవహారం ఓ ప్రహసనంగా మారిందంటున్నారు. బహిరంగ మార్కెట్‌లో భూముల ధరలు విపరీతంగా పెరిగిపోవడం, అలాగే ప్రభుత్వ భూములు అందుబాటులో లేకపోవడంతో భూసేకరణ ప్రధాన సమస్యగా మారింది. ఈ పథకం నీరుగారేందుకు కూడా భూసేకరణతో పాటు రాజకీయ ఒత్తిడులు, అనర్హులకు భూముల కేటాయింపు అలాగే ప్రైవేటు భూములు కొనుగోలులో అవకతవకలు చోటు చేసుకోవడం లాంటి అంశాలన్ని కారణమయ్యాయంటున్నారు. దళితబంధుపైనా సందేహాలుప్రతి నియోజకవర్గంలోని వంద ఎస్సీ కుటుంబాలకు దళిత బంధు పథకం కింద ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షల చొప్పున ఆర్థికసహాయం అందించేందుకు ప్రభుత్వం దళితబంధు పథకాన్ని తెరపైకి తెచ్చింది. అయితే లబ్దిదారుల కేటాయింపుల్లోనూ, గ్రామా ల వేస్సీలకు శాపంగా పరిగణిమిస్తోందంటున్నారు.

# బకాయిల భారం

# గ్రంథాలయాలకు శాపం

మెదక్ : విజ్ఞానం పెంపొందించడంలో గ్రంథాలయాలు కీలక భూమిక పోషిస్తున్నాయి. గ్రంథాలయాలను బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం, స్థానిక సంస్థలు కొన్నేళ్లుగా నిర్లక్ష్యం చేయడంతో వాటి మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుంది. కొన్నేళ్లుగా గ్రంథాలయాలకు రావాల్సిన సెస్‌ను ప్రభుత్వ శాఖలు చెల్లించడం లేదు. ప్రజల నుంచి పన్నులు వసూలు చేస్తున్నా... అందులో గ్రంథాలయాలకు చెల్లించాల్సిన 0.08 శాతం సెస్‌ను అందించడం లేదు. ఫలితంగా పుస్తకాలు, స్టేషనరీ కొనుగోళ్లు, పత్రికలు, విద్యుత్ బిల్లులు, స్వీపింగ్ చార్జీలు, సిబ్బంది వేతనాలతో పాటు మెయింటనెన్స్‌కు నిధులు సరిపోక



ఆర్థిక ఇబ్బందులతో గ్రంథాలయాలు కొట్టుమిట్టాడుతున్నాయి. ఉద్యోగాలకు సిద్ధమయ్యే వాళ్లు గ్రంథాలయాలకు వస్తున్నా.. వారికి కావాల్సిన పుస్తకాలు అందుబాటులో ఉండడం లేదు. గ్రంథాలయాల నుంచి ఎన్ని విజ్ఞప్తులు వచ్చినా సెస్ చెల్లింపుల విషయంలో గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల నుంచి సరైన స్పందన రావడం లేదు. మెదక్ జిల్లాలో 16 గ్రంథాలయాలుమెదక్ జిల్లాలో 16 గ్రంథాలయాలున్నాయి. అందులో జిల్లా కేంద్రంతో పాటు 13 గ్రంథాలయాలకు సొంత భవనాలు ఉన్నాయి. గ్రంథాలయాల నిర్వహణకు సర్కారు నుంచి ఎలాంటి నిధులు రావడం లేదు. గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల్లో ప్రజల నుంచి వసూలయ్యే పన్నుల్లోంచి ప్రతియేటా చెల్లించే 8శాతం సెస్ నిధులతోనే గ్రంథాలయాల నిర్వహణ కొనసాగుతున్నది. సెస్ రూపంలో చెల్లించే నిధులను అడిట్‌లో కూడా ఆయా శాఖలు సూచించాల్సి ఉంటుంది. ఇటీవల కొంత చెల్లించినప్పటికీ మూడేళ్ల నుంచి మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలు స్పందించని పరిస్థితి. దాంతో జిల్లా గ్రంథాలయాలు నిర్వహణ భారంగా మారుతోందని గ్రంథపాలకులు పేర్కొంటున్నారు.రూ. 2.88కోట్ల బకాయిలుకొత్త జిల్లాలు ఏర్పాటైన తర్వాత స్థానిక సంస్థలకు వివి ధ పథకాల ద్వారా నిధులు విడుదలవుతున్నాయి. మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల్లో పన్నుల వసూళ్ల ప్రక్రియ పకడ్బందీగా చేపడుతున్నారు. ఆర్థిక సంవత్సరంలో డిసెంబర్ చివరి వరకు 80శాతానికి పైగా వసూలు చేస్తున్నారు. వసూలు చేసిన పన్నుల్లో 0.08 శాతం సెస్ కూడా అదే రోజు జిల్లా గ్రంథాలయాల సంస్థ ఖాతాకు బదిలీ చేయాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. జిల్లాలోని మెదక్ మున్సిపాలిటీ నుంచి రూ.84,05,891, తూప్రాన్‌లో రూ.15,74,595, నర్సాపూర్‌లో రూ.11,02,300, రామాయంపేటలో రూ7,63,494తో పాటు, జిల్లావ్యాప్తంగా ఉన్న 469 గ్రామపంచాయతీల నుంచి రూ.1,70,31,566 సెస్ బకాయిలు చెల్లించాల్సి ఉంది. మొత్తం రూ. 2,88,31,566 వరకు ఉంది. విధిగా సెస్ చెల్లించాలి - చంద్రాగౌడ్, జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్, మెదక్‌స్థానిక సంస్థలు ప్రజల నుంచి వసూలు చేసే పన్నుల్లోంచి 0.08 శాతం సెస్ రూపంలో గ్రంథాలయాల సంస్థకు విధిగా చెల్లించాలి. ప్రస్తుతం నోటిఫికేషన్లు వెలువడిన నేపథ్యంలో పేద విద్యార్థులు చదువుకోవడానికి గ్రంథాలయాలకు వస్తున్నారు. వారికి అవసరమైన పుస్తకాలు కొనుగోలు చేయాలంటే నిధులు లేక ఇబ్బందులు పడుతున్నాం. జిల్లా గ్రంథాలయ సంస్థకు గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల నుంచి రావాల్సిన సెస్ సక్రమంగా వసూలు కావడం లేదు.బకాయిలు పేరుకుపోయాయి. ఈ విషయమైన జిల్లా అదనపు కలెక్టర్, డీపీవోలకు విజ్ఞప్తి చేశాం.

# చెరువుల మట్టి తరలింపుపై

# కలెక్టర్ నిఘా..

పెద్దపల్లి : జిల్లాలోని చెరువుల నుంచి అనుమతులకు మించి ఇటుక బట్టీల యజమానులు మట్టిని అక్రమంగా తరలించకుండా ఉండేందుకు పకడ్బందీగా నిఘాను పెంచాలని కలెక్టర్ భావిస్తున్నారు. ఆయా శాఖాధికారులు నేరుగా అనుమతులు ఇవ్వకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే పలువురు ఇటుక బట్టీల యజమానులు గనులు, భూగర్భ శాఖాధికారులకు మట్టి కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ విషయమై సదరు శాఖాధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకవెళ్లడంతో ఆయా చెరువుల నుంచి ఏమేరకు మట్టిని తరలించుకుపోయే అవకాశాలున్నాయని నీటి పారుదల శాఖాధికారులను సర్వేకు ఆదేశించారు. ఆ తర్వాత మట్టి తరలింపునకు కావాల్సిన అనుమతుల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించిన తర్వాతనే కలెక్టర్ అనుమతులను ఇవ్వనున్నారు. జిల్లా ఏర్పాటు కాకముందు రెవెన్యూ, గనులు, భూగర్భ శాఖాధికారుల ద్వారా అనుమతులు ఇచ్చిన ప్రభుత్వం జిల్లా ఏర్పాటైన తర్వాత నీటి పారుదల శాఖాధికారుల ద్వారా అనుమతులను ఇచ్చారు. అనుమతులు పొందినవాళ్లు అంతకుమించి అక్రమంగా మట్టిని తరలించుకుపోయి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారనే ఆరోపణలు వచ్చాయి. దీంతో గత ఏడాది నుంచి తిరిగి గనులు, భూగర్భ శాఖాధికారులకే అనుమతులు ఇచ్చే బాధ్యతను అప్పగించారు. ఈ ఏడాది నీటి పారుదల శాఖాధికారులు ఇచ్చే నివేదికల ఆధారంగా కలెక్టరే నేరుగా అనుమతులు ఇవ్వాలని భావిస్తున్నారు. వేసవి కావడంతో పెద్దపల్లి, సుల్తానాబాద్, కాల్వశ్రీరాంపూర్, ఓదెల, మంథని, ముత్తారం, ఎలిగేడు, ధర్మారం, జూలపల్లి, కమాన్‌పూర్ తదితర గ్రామాల్లోని చెరువుల్లో నీటి మట్టాలు తగ్గాయి. చెరువుల ఆయకట్టు కింద వరి పంట సాగు చేస్తుండడంతో వాటికే నీళ్లు సరిపోవడం లేదు. కొన్ని చెరువుల్లో పూర్తిగా నీళ్లు లేకుండా పోయాయి. నెలరోజుల్లో వరి కోతలు పూర్తి కావడంతో పాటు ఎండలకు చెరువులు సైతం ఎండిపోనున్నాయి. ఆ చెరువుల నుంచి మట్టిని తరలించుకుపోవాలని ఇటుక బట్టీల యజమానులు భావిస్తున్నారు. చెరువుల మట్టి కోసం ఇప్పటికే పలువురు ఇటుక బట్టీల యజమానులు గనులు, భూగర్భ శాఖాధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ విషయాన్ని సంబంధిత అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకవెళ్లారు. గత నెల 19వ తేదీన 'చెరువు మట్టిపై కన్ను' నేతల చుట్టూ ఇటుక బట్టీల యజమానులు అనే శీర్షికన ఆంధ్రజ్యోతి జిల్లా ఎడిషన్‌లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఏటా నామమాత్రంగా అనుమతులు..ప్రతిఏటా ఇటుక బట్టీల యజమానులు నామమాత్రంగా అనుమతులు పొందుతూ అక్రమంగా పెద్దఎత్తున మట్టిని తరలించుకుపోతున్నారనే విషయమై పలుసార్లు ఆంధ్రజ్యోతిలో కథనాలు ప్రచురించిన విషయం విదితమే. ఈసారి కూడా ఇటుక బట్టీల యజమానులు బడా ప్రజాప్రతినిధులు అండదండలతో చెరువుల మట్టిని అనుమతులకు మేరకు గాకుండా అంతకుమించి తరలించుకుపోవాలని యత్నిస్తున్నట్లు తెలుస్తున్నది. ముందస్తుగానే గనులు, భూగర్భ శాఖలో దరఖాస్తు చేసుకోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో మట్టి తరలింపునకు అనుమతులు ఇచ్చే విషయమై ఆచితూచి అడుగేయాలని భావిస్తున్నట్లు తెలుస్తున్నది. ఆ మేరకు ప్రస్తుతం జిల్లాలో ఉన్న చెరువులు, కుంటలు ఎన్ని, వాటిలో ఏ మేరకు నీళ్లు ఉన్నాయి, నీళ్లు లేకుండా ఎన్ని ఖాళీగా ఉన్నాయి, ఎన్ని చెరువులు ఎండిపోయాయి, ఎంత పరిమాణంలో పూడిక మట్టి తీయవచ్చు, అసలు మట్టి తీసేందుకు అవకాశాలున్నాయా, లేదా, తదితర అంశాలపై సర్వే చేసి నివేదిక సమర్పించాలని కలెక్టర్ నీటి పారుదల శాఖాధికారులను ఆదేశించడంతో వాళు సర్వే ప్రారంభించారు. అన్ని చెరువుల వద్దకు అధికారులు, సిబ్బంది వెళ్లి సర్వే చేస్తున్నారు. మిషన్ కాకతీయ పథకంలో భాగంగా చాలా చెరువులు, కుంటల్లో కొంత మేరకు మాత్రమే పూడిక మట్టిని తీశారు.

# మురుగు కాలువల నిర్మాణం జరిగేనా!

గోదావరిఖని : ప్రధాన మురుగు కాలువల నిర్మాణంలో బల్దియా నిర్లక్ష్యం ఆక్రమణదారులకు వరంగా మారుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నగరంలోని వివిధ ప్రాంతాల్లోని ప్రధాన మురుగు కాలువలు కబ్జాకు గురవుతున్నాయి. గతంలో మార్కండేయకాలనీలో కాలువను మళ్లించి కట్టడాలు చేపట్టగా ఇటీవల ఎన్టీఆర్ నగర్‌లో కాలువ నిర్మాణం వివాదాస్పదంగా మారింది. ఇందిరానగర్ నుంచి మార్కండేయకాలనీ, సప్తగిరి కాలనీ మీదుగా గోదావరిలోకి ప్రవహించే ప్రధాన మురుగు కాలువ కబ్జాలతో అక్కడక్కడా పిల్ల కాలువగా మారింది. నగరపాలక ప్రణాళికలో ఉన్నట్లుగా కాలువను వెడల్పు చేయడంతో పాటు నిర్మాణం చేపట్టేందుకు పాలకవర్గ తీర్మానం చేసినా ప్రయోజనం చేకూరడం లేదు. నగర ప్రజాప్రతినిధులు కాలనీల్లో రహదారులు, భూగర్భ మురుగు కాలువల నిర్మాణంపై దృష్టి సారించడం మినహా ప్రధాన మురుగు కాలువలను పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

గుత్తేదారు జాప్యం...మార్కండేయకాలనీలోని ప్రధాన మురుగు కాలువ నిర్మాణానికి సుమారు రెండేళ్ల క్రితం టెండర్లు నిర్వహించి గుత్తేదారునకు పని అప్పగించినప్పటికీ చేపట్టడం లేదు. దీంతో క్రమక్రమంగా ఈ కాలువకు ఇరువైపులా ఉన్నవారు కొందరు కాలువ స్థలాన్ని ఆక్రమించుకుంటున్నారు. సదరు గుత్తేదారు నిర్లక్ష్యాన్ని నగరపాలిక పట్టించు



కోవడం లేదు. కాలువ నుంచి వచ్చే దుర్గంధంతో పక్కనే ఉన్నవారు రోగాల బారిన పడుతున్నారు. వరద కోతతో గోడలు కూలిపోతాయేమోనని ఆయా ప్రాంతవాసులు ఆందోళనకు గురవుతున్నారు. మార్కండేయకాలనీకి పైభాగాన గతంలో ఈ కాలువను మళ్లించి కట్టడాలు చేపట్టారు. రామగుండం ఎరువుల కర్మాగారం వ్యర్థ జలాలతో పాటు ఇందిరానగర్ నుంచి మొదలుకొని ఆయా కాలనీల్లోని వరదనీరంతా ఈ కాలువద్వారానే గోదావరిలోకి వెళుతోంది.

ప్రహరీ నిర్మించడం.. కూల్చడం

ఇందిరానగర్‌లోని ఈ మురుగు కాలువను తరచూ ఆక్రమించుకునేందుకు ప్రయత్నాలు సాగుతుండగా ఎప్పటికప్పుడు నగరపాలక అధికారులు అడ్డుకొని కాలువను వెడల్పు చేస్తుంటారు. ఓ దశలో కాలువ నిర్మాణానికి బల్దియా ప్రణాళికలు సిద్ధం చేసినా ఆచరణకు నోచుకోవడం లేదు. కాలువకు ఓ వైపున కొందరు ఇది తమ స్థలమంటూ పలుమార్లు ప్రహరీ నిర్మించడం, నగరపాలిక దానిని కూల్చడం జరిగింది. కాలువ నిర్మాణం చేపడితే ఆక్రమణలకు అవకాశం ఉండదు.

ఖాళీ స్థలాల్లో మడుగులు

టీచర్స్ కాలనీ పక్కనుంచి ప్రవహించే ప్రధాన మురుగు కాలువ ఇది. మొదట్లో కాలువ విశాలంగా ఉన్నా కిందికి వెళ్లే సరికి కబ్జాల కారణంగా కుచించుకుపోయింది. రాజీవ్ రహదారి దాటాక ఇందులో నాలుగోవంతు వెడల్పు సైతం లేదు. ఇరువైపులా ఆక్రమణలున్నాయి. వర్షాకాలంలో వరద నీరు ఒక్కసారిగా వెళ్లక పోవడంతో టీచర్స్ కాలనీ ముందున్న జీవితబీమా సంస్థకు చెందిన ఖాళీ స్థలంలో నీరునిలిచి చెరువును తలపిస్తోంది. సాయినగర్, టీచర్స్ కాలనీ, కేసీఆర్ కాలనీ, ప్రగతినగర్, పద్మావతి కాలనీ తదితర ప్రాంతాల నుంచి వరద, మురుగు నీరంతా ఈ కాలువ ద్వారానే గోదావరిలోకి వెళుతోంది. పందులు, దోమల బెడద తీవ్రంగా ఉంది.

కాలువలో విరిగిపడుతున్న చెట్లు

ప్రభుత్వ వైద్య కళాశాల ప్రధాన రహదారి నుంచి సప్తగిరి కాలనీ మీదుగా వచ్చే మురుగు గోదావరిలో కలుస్తోంది. కాలువకు ఇరువైపులా ఉన్న చెట్లు తరచూ కాలువలో విరిగి పడుతున్నాయి. దీంతో వరద ప్రవాహం నిలిచిపోతోంది. ఆయా ప్రాంతవాసులు దుర్గంధం భరించలేక పోతున్నారు. సప్తగిరి కాలనీలో కబ్జాకు ప్రయత్నాలు సాగుతున్నాయి. నగర సగభాగం నుంచి మురుగు, వరద ఈ కాలువ ద్వారానే గోదావరికి చేరుతుంది. భారీ వర్షాలు కురిసినప్పుడు ఈ ప్రాంతం ముంపునకు గురవుతుంది.

# అభయహస్తం

సంగారెడ్డి : శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల తొలి జాబితాను కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. జిల్లాలో అయిదు నియోజకవర్గాలు ఉన్నాయి. సంగారెడ్డి, జహీరాబాద్, అందోలు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించగా.. పటాన్‌చెరు, నారాయణఖేడ్‌లో ఎవరు బరిలో నిలుస్తారనే విషయమై సందిగ్ధం నెలకొంది.

సంగారెడ్డి బరిలో జగ్గారెడ్డి

సంగారెడ్డి నియోజకవర్గ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే జగ్గారెడ్డి పేరును ఆ పార్టీ అధిష్ఠానం ప్రకటించింది. ఆయన 2004లో తెరాస(భారాస) నుంచి పోటీ చేసి విజయం సాధించారు. తర్వాత కాంగ్రెస్‌లో చేరారు. 2009లో కాంగ్రెస్ నుంచి గెలిచి ప్రభుత్వ విప్‌గా పని చేశారు. 2014లో చింతా ప్రభాకర్ చేతిలో ఓటమి పాలయ్యారు. 2018లో తెరాస(భారాస) అభ్యర్థి చింతా ప్రభాకర్‌పై విజయం సాధించారు.

అందోలు: దామోదర మరోసారి..అందోలు అసెంబ్లీ స్థానం నుంచి మరోసారి పోటీ చేయడానికి దామోదర రాజనర్సింహ పేరును కాంగ్రెస్ అధిష్ఠానం ప్రకటించింది. ఎస్సీ రిజర్వుడు స్థానమిది. 1989లో ఇక్కడి నుంచి దామోదర పోటీ చేసి విజయం సాధించారు. 1994, 1998(ఉప ఎన్నిక), 1999 ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. 2004లో విజయం సాధించి మార్కెటింగ్ శాఖ మంత్రిగా, 2009లో గెలిచి ఉప ముఖ్యమంత్రిగా, సాంకేతిక విద్యాశాఖ మంత్రిగా సేవలందించారు. 2014, 2018లో ఓటమి పాలయ్యారు.

జహీరాబాద్: చంద్రశేఖర్‌కు టికెట్

జహీరాబాద్ అసెంబ్లీ స్థానం నుంచి కాంగ్రెస్ తరఫున చంద్రశేఖర్ పోటీ చేయనున్నారు. ఆయన వికారాబాద్ స్థానం నుంచి 1985లో తెదేపా తరఫున పోటీచేసి విజయం సాధించారు. 1989, 1994, 1999లోనూ గెలిచి అప్పటి తెదేపా ప్రభుత్వంలో మంత్రిగా పనిచేశారు. 2004లో తెరాస(భారాస) తరఫున బరిలో నిలిచి విజయం సాధించారు. 2008లో జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి జి.ప్రసాద్‌కుమార్ చేతిలో ఓటమి పాలయ్యారు. అనంతరం భాజపా, ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరారు. మాజీ మంత్రి గీతారెడ్డి జహీరాబాద్ నుంచి పోటీ చేయడం లేదని స్వచ్ఛందంగా ప్రకటించడంతో.. కాంగ్రెస్ పార్టీ చంద్రశేఖర్‌కు అవకాశం కల్పించింది. రెండు స్థానాలపై కొనసాగుతున్న కసరత్తు నారాయణఖేడ్ నుంచి మాజీ ఎంపీ సురేశ్ షెట్కార్, పీసీసీ ఉపాధ్యక్షుడు సంజీవరెడ్డి కాంగ్రెస్ టికెట్ ఆశిస్తున్నారు.

# లాభాల వాటా పంపిణీపై గందరగోళం



గోదావరిఖని : సింగరేణి లాభాల వాటా పంపిణీపై గందరగోళం నెలకొంది. ఎప్పుడూ లేని విధంగా ఈసారి ఎన్నికల కోడ్ పేరుతో యాజమాన్యం పంపిణీని వాయిదా వేసింది. దీంతో కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కార్మికులకు లాభాల వాటా పంపిణీ చేయాల్సి ఉంది. దీనిని వాయిదా వేస్తూ యాజమాన్యం ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల కోడ్ వచ్చినందున లాభాల వాటాను పంపిణీ చేయలేమని ఆదేశాల్లో పేర్కొంది. తిరిగి ఎప్పుడు పంపిణీ చేసేది ఎన్నికల సంఘంతో మాట్లాడిన తర్వాత ప్రకటిస్తామని పేర్కొంది. గతంలో ఎప్పుడూ కార్మికులకు పంపిణీ చేసే లాభాల వాటా, బోనస్ విషయంలో ఈ పరిస్థితి తలెత్తలేదు. కంపెనీకి సంబంధించిన లాభాలు కార్మికులకు పంపిణీ చేయడం సంస్థాగతంగా తీసుకునే నిర్ణయం. తొలిసారిగా ఎన్నికల కోడ్ పేరుతో వాయిదా వేయడంపై కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సింగరేణి సంస్థ 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.2,222 కోట్లు లాభాలు ఆర్జించింది. దీనిపై కార్మికులకు 32 శాతం వాటా పంపిణీ చేసేందుకు సెప్టెంబరు 26న నిర్ణయించారు. సింగరేణి యాజమాన్యం కార్మికులకు అక్టోబరు 16న పంపిణీ చేస్తామని ప్రకటించింది. ఏ విధంగా పంపిణీ చేస్తామన్న విషయాలను సైతం ఆదేశాల్లో పేర్కొంది. హాజరు, వ్యక్తిగత, బృంద ప్రతిభ లెక్కల ప్రకారం కార్మికులకు లాభాల వాటాను పంపిణీ చేస్తామని వెల్లడించింది. కార్మికుల ఖాతాల్లో డబ్బులు జమ చేసేందుకు ఏర్పాటు చేసిన సింగరేణి శనివారం జారీ చేసిన ఆదేశాలతో కార్మికుల్లో ఒక్కసారిగా ఆందోళన నెలకొంది. కార్మికులకు ప్రతీ సంవత్సరం లాభాల వాటాను పంపిణీ చేస్తారు. దీంతో పాటు దీపావళి ముందు పీఎల్ఆర్ బోనస్‌ను పంపిణీ చేస్తారు. ఇది కార్మికులు సాధించుకున్న హక్కు. దీనికి ప్రభుత్వంతో ఎలాంటి సంబంధం లేదు. కాగా యాజమాన్యం తాజా నిర్ణయంతో కార్మిక సంఘాల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎలాంటి జాప్యం లేకుండా కార్మికులకు లాభాల వాటాను పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. కార్మికులు ఏటా కష్టపడి చేపట్టిన బొగ్గు ఉత్పత్తిపై వచ్చే వార్షిక ఆదాయంపై ప్రతి సంవత్సరం కొంత వాటాను పంపిణీ చేయడం ఆనవాయితీగా వస్తోంది. 1999 నుంచి ఇది కొనసాగుతోంది. దీనికి ఎన్నికల కోడ్‌కు ఎలాంటి సంబంధం లేదన్నది కార్మికుల వాదన.

యాజమాన్యం తీరు శోచనీయం

– వి.సీతారామయ్య, ఏఐటీయూసీ


సింగరేణి యాజమాన్యం తీరు శోచనీయం. ఎన్నికల కోడ్‌కు లాభాల వాటా పంపిణీకి ఎలాంటి సంబంధం లేదు. ఇది ఎన్నికల కోడ్ కిందకు రాదు. కొత్తగా యాజమాన్యం ఎన్నికల కోడ్‌ను చూపిస్తోంది. అనేక సార్లు ఎన్నికల సమయంలో లాభాల వాటా పంపిణీ చేశారు. కొత్తగా ఈసారి ఎన్నికల కోడ్ చూపించి వాయిదా వేసే ప్రయత్నం చేస్తుంది. వెంటనే కార్మికులకు ప్రకటించిన తేదీన చెల్లించాలి. లేదంటే ఆందోళనలు తప్పవు.

గుర్తింపు సంఘం రాజకీయం

– వై.సత్తయ్య, బీఎంఎస్

గుర్తింపు సంఘం తీరుతోనే ఇది జరుగుతోంది. యాజమాన్యంతో కుమ్మక్కై మళ్లీ మాట్లాడి ఇప్పిస్తున్నామని ప్రకటించి లబ్ధి పొందాలని చూస్తోంది. వచ్చే గుర్తింపు ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ఈ అంశానికి తెరతీశారు. దీనికి యాజమాన్యం సహకరిస్తుంది. కార్మికుల లాభాల వాటా పంపిణీకి ఎన్నికల కోడ్ అడ్డంకి కాదు. ఇది వరకు ఎప్పుడూ ఇలా జరగలేదు. కార్మికులకు యథావిధిగా లాభాల వాటాను పంపిణీ చేయాలి. లేదంటే కార్మికులతో కలిసి పోరాటం చేస్తాం.

# నమోదులో పొరపాటు.. నిలిచిన సాయం




మెట్‌పల్లి : రైతులకు మేలు చేయడానికి ప్రభుత్వం భూప్రక్షాళన చేపట్టింది. అయితే కొంత మంది రెవెన్యూ సిబ్బంది చేసిన పొరపాటు అన్నదాతల పాలిట శాపంగా మారింది. ఆధార్ సంఖ్య అనుసంధానంలో పొరపాటు కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తప్పును సరిదిద్దడంలో జాప్యం జరుగుతుండడంతో బాధిత రైతులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ఆదుకునేందుకు పీఎం కిసాన్ సమ్మాన్ నిధి, రైతుబంధు సాయం అందజేస్తున్న సంగతి తెలిసిందే. ఇన్ని రోజులు రైతులకు నగదు జమఅయ్యాయి. దీనికి తోడు రైతుబీమాకు కూడా అర్హులయ్యారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి సాయం కొంత కాలంగా ఆధార్ సంఖ్య ఆధారంగా జమవుతోంది. మరణించిన రైతులకు పీఎం కిసాన్ సమ్మాన్ నిధి సాయాన్ని నిలిపివేశారు. ఈ క్రమంలో కొందరు బతికున్న రైతులకు కూడా సాయం నిలిచిపోయింది. దీంతో సదరు రైతులు వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఒకే ఆధార్ సంఖ్యను ఒకరి కంటే ఎక్కువ మందికి అనుసంధానం చేశారు. ఇందులో ఒకరు చనిపోయినా అదే ఆధార్ సంఖ్య అనుసంధానం చేసిన వారందరికీ సాయం నిలిచిపోతోంది. దీంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

సమస్యకు పరిష్కారమేదీ..?

మెట్‌పల్లి మండలంలో చాలా మంది రైతులు ఈ సమస్యను ఎదుర్కొంటున్నారు. మండలంలో సుమారు వంద మందికి పైగా బాధితులున్నట్లు తెలుస్తోంది. భూప్రక్షాళన సమయంలో ఇంటి పేరు ఒకే విధంగా ఉన్న రైతులకు ఒకే ఆధార్ సంఖ్య అనుసంధానం చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు రైతులు మృతి చెందడంతో ఒకే ఆధార్ సంఖ్య అనుసంధానమైన మిగతా రైతులు కూడా చనిపోయినట్లు ఆన్‌లైన్లో చూపిస్తుంది. సమస్య తీర్చాలని కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పరిష్కారం కావడం లేదని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పది విడతల సాయం వచ్చిందని, ఆ తర్వాత నాలుగు విడతలుగా రావడం లేదని వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను త్వరగా పరిష్కరించి సాయం అందేలా చూడాలని కోరుతున్నారు.

ఈ చిత్రంలో కనిపిస్తున్నవి రెండు వేర్వేరు పాసుపుస్తకాలు. మెట్‌పల్లి మండలం బండలింగాపూర్‌కు చెందిన ముదాం రాజేశ్వర్‌కు 2.28 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి సాయం నిలిచిపోవడంతో ఆన్‌లైన్లో పరిశీలించగా, ఆయన చనిపోవడంతో నిలిపివేసినట్లు కారణం చూపారు. వేంపేటకు చెందిన గంగుబాయి పట్టాదారు పాసుపుస్తకానికి రాజేశ్వర్ ఆధార్ సంఖ్యను అనుసంధానం చేశారు. ఇద్దరి పాసుపుస్తకాలకు ఒకే ఆధార్ సంఖ్యను అనుసంధానం చేయడంతో సమస్య తలెత్తింది. ఒకే ఆధార్ సంఖ్యను ఒకరి కంటే ఎక్కువ మందికి నమోదు చేశారనేందుకు ఇదే నిదర్శనం. సిబ్బంది తప్పిదంతో బాధిత రైతులు సాయం అందక అవస్థలు పడుతున్నారు.

సాయం రావడం లేదు–ఎక్కతి చిన్నోల్ల గంగారాం, చెర్లకొండాపూర్

నాకు 1.20 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. గత కొన్ని నెలలుగా పీఎం కిసాన్ సమ్మాన్ నిధి సాయం జమ కావడం లేదు. పదిసార్లు సాయం రాగా, నాలుగు విడతలుగా రావడం లేదు. సాయం అందక అవస్థలు పడుతున్నాం. ఆన్‌లైన్లో చనిపోయినట్లు చూపిస్తుందని అంటున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

ఇద్దరికీ ఒకే ఆధార్ సంఖ్య నమోదు–ముదాం రాజేశ్వర్, బండలింగాపూర్

కొంతకాలంగా పీఎం కిసాన్ సమ్మాన్ నిధి సాయం రావడం లేదు. అధికారులను అడిగితే నా పట్టాదారు పాసు పుస్తకంతో పాటు వేంపేటకు చెందిన మరొకరి పట్టాదారు పాసు పుస్తకానికి నా ఆధార్ సంఖ్యను అనుసంధానం చేశారని చెబుతున్నారు. ఆన్‌లైన్లో తాను చనిపోయినట్లుగా నమోదు కావడంతో రావడం లేదు. తహసీల్దార్ కార్యాలయంలో మళ్లీ దరఖాస్తు చేశాను. ఇంకా పరిష్కరించలేదు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

–శేఖర్, తహసీల్దార్ ఆధార్ సంఖ్య అనుసంధానంలో తప్పిదంతో పీఎం కిసాన్ సమ్మాన్ నిధి సాయం రావడం లేదని కొందరు రైతులు సమస్యను మా దృష్టికి తీసుకొచ్చారు. రైతులు ఇచ్చిన దరఖాస్తును ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. సమస్య పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం.

# కాలువలు అధ్వానం.. ఆయకట్టు దయనీయం

ఆసిఫాబాద్: వరి పొలాలు నీళ్ల కోసం నెర్రలు తెరుస్తుండటంతో అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. జలాశయంలో నిండా నీరున్నా కాలువల్లో పూడిక తీస్తేనే చేన్లలోకి సాగునీరందే పరిస్థితి నెలకొనడంతో పంట రక్షణ కోసం అన్నదాతలు నడుం బిగించారు. ఊరంతా కాలువల బాటపట్టారు. నాలుగు రోజులుగా పూడికను తొలగిస్తున్నారు కుమురం భీం జిల్లా వట్టివాగు ఆయకట్టు రైతులు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేకపోవడంతో స్వయంగా కాలువలు శుభ్రం చేసుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రెండు టీఎంసీల సామర్థ్యం ఉన్న వట్టివాగు ప్రాజెక్టు 25 వేల ఎకరాలకు సాగునీరు అందించాలి. ఏటా కాలువల ఒడ్డున ఉన్న మట్టి కూలిపోవడం, విపరీతంగా తుంగ పేరుకుపోవడంతో 1000 ఎకరాలకు సైతం నీరందడం లేదు. ఏటా భారీ వర్షాలకు పెద్దఎత్తున మట్టి కాలువలో చేరుతోంది. దీనికితోడు తుంగ పెరిగి నీరు విడుదల చేసినా.. పొలాల వరకు చేరుకునే పరిస్థితి లేదు. ఈసారి ఎండలు మండుతుండటంతో వరి పొలాలు ఎండిపోతున్నాయి. అధికారుల నుంచి స్పందన లేకపోవ డంతో



రెబ్బెన మండలంలోని నక్కలగూడ, పుంజుమేరగూడ, రెబ్బెన, పర్సనంబాల రైతులు నాలుగు రోజుల నుంచి కాలువల్లో పూడికను తీస్తున్నారు. పలుగు, పార చేతపట్టి కాలువల్లోని మట్టిని తీస్తున్నారు.

విధుల్లోకి రాని లష్కర్లు

వీఆర్ఏల క్రమబద్ధీకరణలో తొమ్మిది మందిని లష్కర్లుగా నియమించినా, విధుల్లోకి ఎవరూ వెళ్లడం లేదు. వారిలో ఇద్దరిని కలెక్టర్ హేమంత్ బోర్కడే ఎన్నికల విధులకు కేటాయించారు. రిలీవ్ కాకముందే ఈ విధంగా కేటాయించడం పట్ల సంబంధిత అధికారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. గతంలో లష్కర్లుగా ఉన్న 11 మందికి రెండేళ్లుగా వేతనాలు ఇవ్వలేదు. అధికారులు స్పందించి తుంగ, పూడిక తీసి ఎండుతున్న వరి పొలాలను కాపాడాలని రైతులు వేడుకుంటున్నారు.

# కోడ్ తెచ్చిన తంటా..

ఆసిఫాబాద్: ఎన్నికల వేళ.. నిధులు మంజూరైనా ప్రగతి పనులు ముందుకుసాగని పరిస్థితి ఎదురవుతోంది. మరోవైపు ఇప్పటికే కొనసాగుతున్న పనుల్లో నాణ్యతాలోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. కోడ్ అమలుతో జిల్లాలో ఏకంగా.. రూ.86.32 కోట్ల నిధులకు సంబంధించిన 698 పనులు నిలిచిపోయాయి. రూ.కోట్ల అంచనాలతో జరుగుతున్న నాణ్యత ప్రశ్నార్థకంగా మారిన వైనంపైకథనం.

రాష్ట్ర శాసనసభ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చింది. కొత్త పనుల ప్రారంభం, పూర్తి చేయడంలో అధికారులు, గుత్తేదారులు తాత్సారం చేయడంతో పనులేవి అడుగు ముందుకు పడని పరిస్థితి. ఎన్నికలు ముగిశాక అంటే డిసెంబరు 5వ తేదీ తర్వాతే పనులు ఊపందుకునే అవకాశముంది. కోడ్‌రాక ముందు పనులు పురోగతిలో ఉన్నాయని రికార్డుల్లో చూపిస్తున్నా.. పనుల్లో వేగం కనిపించక ప్రజలు రవాణా, ఇతర సౌకర్యాలకు దూరంగా ఉంటున్నారు. ముఖ్యంగా ప్రజాప్రతినిధులు ప్రతిపాదించిన పనుల్లోనూ ప్రగతి కనిపించకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. మరోవైపు ప్రజాప్రతినిధులు, అధికారులు ఎన్నికల పనుల్లో నిమగ్నం కావడంతో గుత్తేదారులు ఇష్టారీతిన పనులు చేస్తూ నిధులు దుర్వినియోగానికి కోడ్‌ను అనువుగా మార్చుకుంటున్నారనే ఆరోపణలు లేకపోలేదు.



సిఫారసులు చేసినా నిష్ప్రయోజనమే..

ప్రజాప్రతినిధులు గ్రామాల సందర్శనకు వెళ్లినపుడు ప్రజలు తమ దృష్టికి తెచ్చే సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయిస్తుంది. అందులో భాగంగా ఎమ్మెల్యేలకు సీడీఎఫ్(నియోజకవర్గ అభివృద్ధి నిధులు), డీఎంఎఫ్‌టీ(డిస్ట్రిక్ మినరల్ ఫండ్ ట్రస్టు) సీఎం వచ్చినపుడు ఎస్‌డీఎఫ్(ప్రత్యేక అభివృద్ధి నిధులు) పేరిట నిధులు మంజూరు చేస్తారు. అదే ఎంపీ అయితే ఎంపీల్యాడ్ పేరిట నిధులు ప్రతిపాదిస్తారు. రహదారులు, మురుగు కాలువలు, కమ్యూనిటీ భవనాలు, సీసీరోడ్లు, తాగునీటి సదుపాయం, మొరం, మట్టి రోడ్ల నిర్మాణం వంటివి తమ అనుచరగణానికి నామినేషన్ పద్ధతిన పనులు అప్పజెప్పడం ఆనవాయితీగా వస్తోంది. కోడ్ అమల్లోకి రావడంతో చాలా పనులు ప్రారంభించకపోగా.. ప్రస్తుతం కొనసాగుతున్న పనులపైనా ఎన్నికల ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది.

అధ్వానంగా రహదారి..

ఇది మహారాష్ట్ర–తెలంగాణ రాష్ట్రవాసులకు అనువైన భీంపూర్ మండలంలోని అంతర్రాష్ట్ర రహదారి. ఈదుల్లా సావర్గాం–నిపాని, దనోర–కరంజి–గుబిడి వరకు రూ.24 కోట్లు మంజూరైనా.. టెండరులో అధికారుల అలసత్వంతో పనులు ప్రారంభం కాలేదు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ ఉన్న దృష్ట్యా.. డిసెంబరు వరకు పనులు ప్రారంభమయ్యే అవకాశం లేదు. దీంతో ఎప్పటిమాదిరిగానే మండలవాసులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

నాసిరకంగా పనులు..ఎన్నికల ఏర్పాట్లలో అధికారులంతా నిమగ్నం కావడంతో.. ఇప్పటికే కొనసాగుతున్న పనుల్లో నాణ్యత లోపిస్తోంది. అందుకు భీంపూర్ కస్తూర్బా బాలికల విద్యాలయ భవన నిర్మాణ పనులే నిదర్శనం. గోదావ రి ఇసుకకు బదులు నల్ల ఇసుక, పగుళు తేలిన సిమెంటు ఇటుకలను వినియోగిస్తున్నారు. పనులను ఎవరూ పట్టించుకోరనే ధీమాతో గుత్తేదారు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. బాలికల భవిష్యత్తు దృష్ట్యా పనులు నాణ్యతగా జరిగేలా అధికారులు పర్యవేక్షణ చేయాల్సి ఉంది.

# ఆఖరి మజిలీకి అవస్థలు

బెజ్జూరు : జిల్లాలో వైకుంఠధామాల నిర్వహణ లేక అవస్థలు తప్పడం లేదు. ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలోపం.. గుత్తేదారులు ఇష్టారాజ్యంగా నిర్మించడంతో భారీ వర్షాలకు పలుచోట్ల కూలిపోయాయి. తిరిగి మరమ్మతులు చేపట్టాల్సిన అధికారులు ఏడాదిగా జాప్యం చేస్తున్నారు. మరికొన్నింటికి మౌలిక సదుపాయాలైన విద్యుత్తు, నీటి సదుపాయం లేక నిరుపయోగంగా మారాయి. ఫలితంగా అంత్యక్రియలకు ఇబ్బందులు తప్పడం లేదు. జిల్లాలో 335 పంచాయతీలుండగా.. 334 వైకుంఠధామాలు మంజూరయ్యాయి. 2020-2021లో ఉపాధిహామీ కింద ఒక్కో నిర్మాణానికి రూ.12.50 లక్షలు కేటాయించారు. 334 నిర్మాణాల్లో 267 శశ్మాన వాటికలు పంచాయతీరాజ్ ద్వారా, 67 ఉపాధిహామీ పథకంలో చేపట్టారు. బిల్లుల చెల్లింపులో జాప్యం, ఇతర సమస్యల కారణంగా చాలాచోట్ల నిర్మాణాలు అసంపూర్తిగా వదిలేశారు.

పురపాలికలో ఇలా..కాగజ్‌నగర్ పురపాలిక పరిధిలోని గంగారాంబస్తీ, కోసిని, బోరిగాం సమీపంలో రెండు వైకుంఠధామాలకు ఒక్కో దానికి రూ.కోటి చొప్పున కేటాయించారు. రెండేళ్ల క్రితం పురపాలిక పబ్లిక్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో పనులు ప్రారంభించారు. గంగారాం బస్తీ వైకుంఠధామం గతేడాది పూర్తి కాగా, ఇంకా ప్రహరీ, ప్లాట్‌ఫాం, విద్యుత్తు, నీటి సదుపాయం, సమీపంలోని వాగుపై కల్వర్టు నిర్మాణం పనులు చేపట్టాల్సి ఉంది. ఆ పనులకు అదనంగా రూ.50 లక్షలు కావాలని ప్రతిపాదనలు పంపారు. పనులు పూర్తి కాకముందే పలుచోట్ల పగుళ్లు తేలి భవనాలు కుంగిపోయాయి. బోరిగాం శివారులోని శ్మశానవాటికలో స్లాబ్ పనులు పూర్తయ్యాయి. బిల్లు రాకపోవడంతో గుత్తేదారు మిగతా పనులు నిలిపివేశారు.

బెజ్జూరు మండల కేంద్రంలోని వైకుంఠధామం నిర్మాణం పూర్తయినప్పటికీ విద్యుత్తు, నీటి సదుపాయం లేక నిరుపయోగంగా మారింది. సమీపంలోని ఖాళీ స్థలంలో అరకొర సౌకర్యాల నడుమ అంతిమయాత్ర నిర్వహించా ల్సిన దుస్థితి నెలకొంది.

కాగజ్‌నగర్ మండలం అందవెల్లి సమీపంలో పెద్దవాగు వద్ద నిర్మించిన వైకుంఠధామం. గతేడాది కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా కొట్టుకుపోయింది.

గతేడాది కురిసిన భారీ వర్షాలకు దహెగాం మండలం పెద్దవాగు శివారులో నిర్మించిన రెండు వైకుంఠధామాలు వరదలకు కొట్టుకుపోయాయి. ఏడాది గడిచినా వీటికి మరమ్మతులు చేయడం లేదు.

కాగజ్‌నగర్ పురపాలిక పరిధి సర్‌సిల్క్ కాలనీ ఏరియా వాగు సమీపంలో రూ.కోటి వ్యయంతో నిర్మిస్తున్న వైకుంఠధామం పనులు 80 శాతం పూర్తి చేశారు. చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో గుత్తేదారు పనులు నిలిపివేశారు. వాగుపై కల్వర్టు నిర్మించకపోవడంతో చివరి మజిలీకి అవస్థలు తప్పడం లేదు.

చర్యలు తీసుకుంటాం

అంజయ్య, పురపాలిక కమిషనర్

కాగజ్‌నగర్ పురపాలికలోని వైకుంఠధామాల పనులు సాగుతున్నాయి. బిల్లుల మంజూరు జాప్యంతో కొంత మేరకు జాప్యం జరుగుతోంది. సకాలంలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

# పత్తి రైతుకు మద్దతుగా ప్రభుత్వ శాఖలు

ఖమ్మం : గత ఏడాది భారత పత్తి సంస్థ(సీసీఐ) కొనుగోళ్లు లేకపోవడంతో వ్యవసాయ మార్కెట్లలో ప్రైవేటు వ్యాపారులే సరకును కొనుగోలు చేశారు. సీసీఐ ఈసారి మళ్లీ పత్తి కొనుగోళ్లకు సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో వ్యవసాయ మార్కెట్లలో, సీసీఐ కేంద్రాల్లో, నోటిఫై చేసిన జిన్నింగ్ మిల్లుల్లో జిల్లాస్థాయి కమిటీ ఆదేశాల ప్రకారం రైతులకు కనీస మద్దతు ధర కల్పించేందుకు తగిన ఏర్పాట్లు ప్రారంభించారు. మార్కెటింగ్, అగ్నిమాపక, తూనికలు కొలతలు, వ్యవసాయ, రెవెన్యూ, పోలీసు శాఖలకు తగిన ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు సంబంధిత శాఖలతో జిల్లాస్థాయి కమిటీ ఛైర్మన్‌లయిన అదనపు కలెక్టర్లు ఇప్పటికే ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో సంబంధితశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. దసరా పండుగ తర్వాత పత్తి కొనుగోళ్లు ఊపందుకునే అవకాశం ఉంది. రైతులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా ఈలోపే ఏర్పాట్లపై ప్రభుత్వం దృష్టి



సారించింది. అగ్నిమాపక శాఖ అగ్నిమాపక యంత్రాలను ఏర్పాటు చేసి వాటి పనితీరును పర్యవేక్షిస్తుంది. తూనికలు కొలతల శాఖ యార్డుల్లో తూకం యంత్రాలు, జిన్నింగ్ మిల్లుల్లోని వే బ్రిడ్జిలను పర్యవేక్షిస్తుంది. వ్యవసాయ, రెవెన్యూ శాఖలు కొనుగోళ్లకు సంబంధించి తగిన కార్యాచరణ ప్రణాళిక తయారు చేస్తాయి. పోలీసు శాఖ శాంతి భద్రతల అంశాలన్ని పర్యవేక్షిస్తుంది.

మార్కెట్ కమిటీలే కీలకంపత్తి జిన్నింగ్‌లో మార్కెట్ కమిటీలు కీలక భూమిక పోషిస్తాయి. రైతులకు కనీస మద్దతు ధర లభించేలా ఇవి చూస్తాయి. పత్తిని నిల్వ చేసేందుకు అవసరమైన గోదాములు సమకూర్చడం, మద్దతు ధరలు తెలిపేలా యార్డుల్లో బోర్డుల ఏర్పాటు, మద్దతు ధర, సీసీఐ కొనుగోళ్లు, జిన్నింగ్ మిల్లుల ఏర్పాట్లపై కరపత్రాల ద్వారా ప్రచారం నిర్వహించడం వంటివి చేస్తుంది.

# సమస్యలు పరిష్కరించే నాయకుడికే ఓటు

భూపాలపల్లి : యువత అంటే కేవలం ఓటరే కాదు నవతరం శక్తి.. వారు తలుచుకుంటే ఏదైనా సాధ్యమే.. అవకాశాలను అందిపుచ్చుకుంటూ అభివృద్ధి సాధించే శక్తి యువతలోనే ఉంది. అలాంటి యువతకు సరైన అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉంది. ఉద్యోగ కల్పనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి.. చాలా మంది యువత ఉన్నత చదువులు చదివి సరైన ఉపాధి లేక నిరాశకు లోనవుతున్నారు. తమ సమస్యలు పరిష్కరించే నాయకుడికే మొదటి ప్రాధాన్యం ఉంటుందని యువత అంటున్నారు. త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో నూతనంగా ఓటుహక్కు వినియోగించుకోబోతున్న యువ ఓటర్ల మనోగతమిది..

పల్లెల ప్రగతికి కృషి చేసేవారికే..

మార్క వరుణ్, గణపురం

గ్రామాల అభివృద్ధిపై పూర్తి అవగాహన కలిగిన నాయకుడు కావాలి. అలాంటి వ్యక్తి ఎన్నికైతే గ్రామాలను ఎలా అభివృద్ధి చేయాలి..? ఎలాంటి మౌలిక సదుపాయాలు కల్పించాలనే విషయాలపై స్పష్టత కలిగి ఉంటారు. నా మొదటి ఓటు పల్లెల అభివృద్ధికి ఎవరు కృషి చేస్తారో వారికే వేస్తాను. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలి.

సంక్షేమ పథకాలు అర్హులకే అందాలి



కుర్రె గణేశ్, గూడాడ్‌పల్లి, భూపాలపల్లి

ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందించేలా కృషి చేసే నాయకుడు కావాలి. అలాంటి వారినే ఓటువేసి గెలిపించాలి. నిత్యం ప్రజా సేవలో ఉండి చేస్తున్న పనుల్లో పారదర్శకత, జవాబుదారీతనం ఉండేలా కృషి చేయాలి. ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండాలి. అవసరమైన నిధులు తీసుకొచ్చి యువత ఆర్థికంగా ఎదిగేలా చర్యలు తీసుకోవాలి.

యువతకు మార్గదర్శకంగా

ఓరుగంటి సిద్ధు, కొంపెల్లి, భూపాలపల్లి

నిరుద్యోగ యువతను అన్ని విధాలా అభివృద్ధి చేయడానికి సమర్థమైన నాయకుడు అవసరం.. ఎల్లప్పుడు యువత మధ్య ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకోవాలి. విద్య, ఉపాధి అవకాశాలను కల్పించేందుకు ప్రయత్నం చేస్తూ ఆ దిశగా యువతను ఎప్పటికప్పుడు ప్రోత్సహించాలి.

నిరుద్యోగ సమస్య పరిష్కరించాలి

డ్యాగ నిఖిత, మొట్లపల్లి, మొగుళ్లపల్లి

యువత ఉన్నత చదువులు చదివి సరైన ఉపాధి అవకాశాలు లేక తీవ్ర నిరాశలో ఉన్నారు. అలాంటి యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెంచేలా పరిశ్రమలు ఏర్పాటు చేయాలి. ప్రభుత్వాలు అందించే పలు అభివృద్ధి పథకాలు అర్హులైన యువతకు అందేలా చూడాలి. స్వయం ఉపాధి పథకాలకు రాయితీ రుణాలు అందించి యువతను ప్రోత్సహించాలి.

## తాలిపేరు ఎడమ కాల్వకు మళ్లీ గండి

ఖమ్మం : చర్ల మండలంలోని తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్టు పరిధిలోని ప్రధాన ఎడమ కాల్వకు మళ్లీ గండి పడింది. కుదునూరు సమీపంలో 15.9 కి.మీ. వద్ద ఈ గండి ఏర్పడింది. చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో ఆయకట్టు పంటలకు 300 క్యూసెక్కుల చొప్పున సాగునీటిని విడుదల చేస్తున్న క్రమంలో గతంలో గండి పడిన ప్రాంతంలోనే మళ్లీ పడింది. ఆ ప్రాంతం నుంచి పెద్దఎత్తున నీరు వృథాగా పోతోంది. ఆయకట్టు పంటలకు సాగునీటిని విడుదల చేస్తున్న క్రమంలో ఈ ఘటన చోటుచేసుకోవటంతో యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాల్సిందిగా ఎస్ఈ వెంకటరెడ్డి అధికారులను ఆదేశించారు.

# రాజుకున్న వేడి..!



ఖమ్మం. : పది స్థానాల్లో బీ-ఫాంలు అందుకున్న భారాస అభ్యర్థులు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల వేడి రాజుకుంది. దాదాపు 50 రోజుల క్రితమే భారాస తమ అభ్యర్థుల్ని ప్రకటించి ఎన్నికల రణక్షేత్రంలోకి దూకింది. ఆ అభ్యర్థులందరికీ ఆదివారం పార్టీ అధినేత కేసీఆర్ పార్టీ బీ-ఫాంలు అందించడంతో ప్రచార పర్వంలో గులాబీ దండు మరింత దూకుడు పెంచనుంది. ఉమ్మడి జిల్లాలోని మొత్తం 10 అసెంబ్లీ స్థానాల్లోనూ అభ్యర్థులు బీఫాం అందుకున్నారు. ఖమ్మం-పువ్వాడ అజయ్, పాలేరు-కందాల ఉపేందర్‌రెడ్డి, వైరా-మదన్ లాల్, మధిర-లింగాల కమల్ రాజు, సత్తుపల్లి- సండ్ర వెంకటవీరయ్య, కొత్తగూడెం-వనమా వెంకటేశ్వరరావు, ఇల్లెందు-బానోత్ హరిప్రియ, పినపాక-రేగా కాంతారావు, భద్రాచలం-తెల్లం వెంకట్రావు, అశ్వారావుపేట-మెచ్చా నాగేశ్వరరావులకు బీ-ఫాం అందించారు. ముఖ్యమంత్రి కేసీఆర్.. దిశానిర్దేశం మేరకు సోమవారం నుంచి భారాస అభ్యర్థులు పూర్తిస్థాయిలో ప్రచార పర్వానికి శ్రీకారం చుట్టనున్నారు.

బరిలో భట్టి, పొదెం

అటు కాంగ్రెస్ సైతం ఎన్నికల సమర శంఖం పూరించింది. ఆదివారం పార్టీ అభ్యర్థుల తొలి జాబితా ప్రకటించింది. ఇందులో జిల్లాలోని ఇద్దరు సిట్టింగు ఎమ్మెల్యేలకు మాత్రమే స్థానం లభించింది. మధిర, భద్రాచలం ఎమ్మెల్యేలుగా ఉన్న సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, పొదెం వీరయ్య అభ్యర్థిత్వాలను ఖరారు చేసింది. మధిర నుంచి ఇప్పటికే హ్యాట్రిక్ కొట్టిన మల్లు భట్టి విక్రమార్క నాలుగోసారి బరిలో నిలువనున్నారు. భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య.. ఆరోసారి ఎన్నికల బరిలో నిలుస్తున్నారు. ములుగు నియోజకవర్గంలో నాలుగు సార్లు పోటీ చేసి రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. భద్రాచలం నుంచి 2018లో గెలుపొందిన పొదెం మరోసారి భద్రాచలం నుంచి అదృష్టం పరీక్షించుకోనున్నారు.

ఇంకా వీడని ఉత్కంఠ

జిల్లాలో మిగిలిన ఎనిమిది స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులెవరన్న దానిపై ఉత్కంఠ మాత్రం వీడలేదు. ఆయా నియోజకవర్గాల్లో తీవ్ర పోటీ నేపథ్యంలో అభ్యర్థుల ప్రకటనకు మరికొంత సమయం పట్టే అవకాశాలున్నట్లు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. అన్ని నియోజకవర్గాల్లో ప్రధానంగా ఇద్దరు ఆశావహుల మధ్య పోటీ ఉండటంతో ఎంపిక కొంత సంక్లిష్టంగా తయారైంది. ఇదే సమయంలో కమ్యూనిస్టులతో పొత్తుల అంశం కొంతమేర కొలిక్కి వచ్చినప్పటికీ.. సీట్ల లెక్కలు తేలకపోవడం ప్రభావం చూపుతున్నట్లు సమాచారం. కమ్యూనిస్టులతో పొత్తులు కుదిరితే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఒకటి రెండు స్థానాలు ఇవ్వాల్సి వస్తుందని కాంగ్రెస్ భావిస్తోంది. వామపక్షాలు ఏ స్థానాలు డిమాండ్ చేస్తాయో..వారికి ఎక్కడ ఇవ్వాల్సి వస్తుందో తేలకపోవడమూ ఓ కారణమని తెలుస్తుంది. కొన్నిచోట్ల లెక్కలు తేలినప్పటికీ.. మిగిలిన ఆశావహుల్ని బుజ్జగించిన తర్వాతే ప్రకటించాలని భావిస్తున్నట్లు సమాచారం. మొత్తంమీద రెండో దఫాలో కొన్ని, మూడో దఫాలో మిగిలిన స్థానాలకు అభ్యర్థుల్ని ఖరారు చేస్తారన్న ప్రచారం కాంగ్రెస్‌లో సాగుతోంది.

కారులో కుదుపు..

కాంగ్రెస్ గూటికి మాజీ ఎమ్మెల్సీ, ముగ్గురు కార్పొరేటర్లు

హుటాహుటిన హైదరాబాద్ నుంచి మంత్రి రాక, సమావేశం

ఓ వైపు బీ-ఫాంల పంపిణీ, మ్యానిఫెస్టో ప్రకటనతో భారాస శ్రేణుల్లో కోలాహలం నెలకొంది. ఈ తరుణంలో ఖమ్మం జిల్లా కేంద్రంగా ఆ పార్టీలో అదే రోజు కుదుపు చోటుచేసుకుంది. భారాస సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, ముగ్గురు కార్పొరేటర్లు, ఇద్దరు మాజీ కార్పొరేటర్లు, మరికొంతమంది నాయకులు ఒకేరోజు గులాబీ పార్టీకి వీడ్కోలు పలికి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడంతో భారాసకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. స్వయంగా మంత్రి పువ్వాడ అజయ్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఖమ్మం నియోజకవర్గంలో ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి.

భారాస సీనియర్ నేత బాలసాని లక్ష్మీనారాయణ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించాక మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రచార కమిటీ కో-ఛైర్మన్ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఖమ్మంలో ఆయన నివాసానికి వెళ్లి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించటంతో బాలసాని అంగీకరించారు. తుమ్మల, పొంగులేటి విషయం బయటకు పొక్కకుండా చకచకా ముగ్గురు కార్పొరేటర్లు, మరికొంతమంది నాయకుల ఇళ్లకు వెళ్లి పార్టీలోకి స్వాగతించారు. తొలుత భారాస సీనియర్ నాయకుడు, 24వ డివిజన్ కార్పొరేటర్ కమర్తపు మురళి వద్దకు వెళ్లారు. అతణ్ని వెంటబెట్టుకుని 10వ డివిజన్ కార్పొరేటర్ చావా మాధవి నారాయణరావులను కలిశారు. అక్కడి నుంచి 15వ డివిజన్ కార్పొరేటర్ రావూరి కరుణ సైదుబాబు నివాసానికి, 15వ డివిజన్ భారాస అధ్యక్షుడు సంక్రాంతి నాగేశ్వరరావుతోపాటు మరికొందరి వద్దకు వెళ్లారు.

వారందరినీ వెంటబెట్టుకుని నగరంలోని పొంగులేటి నివాసానికి చేరుకున్నారు. కార్పొరేటర్లు, నాయకులు తాము కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ప్రకటించారు. మాజీ కార్పొరేటర్లు చేతుల నాగేశ్వరరావు, పోట్ల శశికళ వీరేందర్, తెదేపా నాయకుడు ఏలూరి శ్రీనివాసరావు, సుడా డైరెక్టర్లు రమేశ్ గౌడ్, ఖాదర్‌బాబు కూడా.. తుమ్మల, పొంగులేటితో కలిసి నడుస్తామని వెల్లడించారు. ఆయా కార్యక్రమాల్లో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు దుర్గాప్రసాద్, నాయకులు బొర్రా రాజశేఖర్, మువ్వా విజయ్‌బాబు, తుమ్మల యుగంధర్, సాధు రమేశ్‌రెడ్డి, సూతకాని జైపాల్, నిరంజన్‌రెడ్డి, మిక్కిలినేని నరేందర్, కార్పొరేటర్లు దొడ్డ నగేశ్, మలీదు జగన్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్నం సమయంలో మేయర్‌ను చరవాణి ద్వారా బాలసాని సంప్రదించేందుకు యత్నించారు. ఫోన్‌లో స్పందించని మేయర్ తన వెంట ఉన్న కార్పొరేటర్లతో కలిసి మమత ఆసుపత్రిలోని సమావేశ మందిరానికి చేరుకున్నారు.

మేమంతా మంత్రి వెంటే.. పార్టీ మారేందుకు సిద్ధమవుతున్న ప్రజాప్రతినిధులను భారాస నాయకులు సంప్రదించేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. హైదరాబాద్ నుంచే మంత్రి పువ్వాడ కార్పొరేటర్లకు ఫోన్ చేసి పార్టీని వీడొద్దని కోరినా ప్రయోజనం లేకపోయింది. దీంతో.. హుటాహుటిన మంత్రి ఖమ్మం చేరుకున్నారు. తన నివాసంలో కార్పొరేటర్లు, రఘునాథపాలెం మండల ముఖ్య నాయకులతో అత్యవసర సమావేశం ఏర్పాటుచేశారు. తాజా పరిణామాలపై చర్చించారు. అందరూ పార్టీ గెలుపు కోసం పనిచేయాలని మంత్రి దిశానిర్దేశం చేశారు. ప్రజాప్రతినిధులు, నాయకులు మాట్లాడుతూ మంత్రి వెంటే నడిచి పార్టీ గెలుపు కోసం కలిసికట్టుగా పనిచేస్తామని తెలిపారు. ఎవరెన్ని కుట్రలు చేసినా.. ప్రలోభాలకు గురిచేసినా అజయ్ వెంటే ఉంటామని స్పష్టం చేశారు.

# సర్కారు బడుల్లో స్వయం ఉపాధికి భరోసా



పెనుబల్లి :పాఠశాల స్థాయిలోనే వృత్తివిద్యా కోర్సులను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇందుకోసం విద్యార్థుల సంఖ్య, మౌలిక వసతులు, ఉపాధ్యాయుల లభ్యత, కోర్సుల అధ్యయనానికి సంబంధించిన సామగ్రిని అమర్చేందుకు తగిన వసతులున్న పాఠశాలలను గుర్తించింది. ఇలా ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను ఎంపిక చేశారు. ప్రతి పాఠశాల రెండు కోర్సులను ఎంచుకోవాలని ప్రభుత్వం సూచించింది.

58 ఉన్నత పాఠశాలలు.. 19 వృత్తివిద్యా కోర్సులు

పదో తరగతి పూర్తయిన తర్వాత స్వయం ఉపాధి కల్పించే, జనాదరణ పొందిన కోర్సులను అందించాలని నిపుణులు సూచించారు. ఇందుకోసం ప్రత్యేక అర్హతలున్న బోధకులను నియమిస్తారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 58 జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలల్లో వృత్తివిద్యా కోర్సులను ప్రారంభించనున్నారు. విద్యార్థులు సులభంగా నేర్చుకునేందుకు వీలున్న 19 రకాల కోర్సులు ప్రవేశపెట్టనున్నారు. ప్రతి పాఠశాల అందులో ఏవైనా రెండు కోర్సులను ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది.

మొదటి, రెండు దశల్లో తర్ఫీదు

పదో తరగతి వరకున్న పాఠశాలల్లో రెండు దశల్లో కోర్సులు నేర్పిస్తారు. తొమ్మిదో తరగతి విద్యార్థులకు లెవల్ ఒకటి పేరుతో విలువైన సమయాన్ని వృథా చేయకుండా ఏదైనా ఒక వృత్తి విద్య నేర్చుకోవాలని మానసికంగా సిద్ధం చేస్తారు. రెండో దశలో విద్యార్థులు కిందట తరగతిలో పేర్కొన్న కోర్సుకు తగిన శిక్షణ, క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పిస్తారు. పదో తరగతి వార్షిక పరీక్షలు ముగిసేనాటికి విద్యార్థులు నేర్చుకున్న అంశంలో పట్టు సాధించేలా తర్ఫీదు ఇస్తారు. మిగతా రెండు దశలను ఇంటర్మీడియట్ వరకు ఉన్న విద్యాసంస్థల్లో అమలు చేస్తారు.

సులభంగా నేర్చుకునేలా ఏర్పాట్లు

విద్యార్థుల ఆసక్తి మేరకు అదే ఆవాసంలో లేదా సమీప పట్టణంలో మంచి ఆదరణ కలిగిన రెండు కోర్సులను ఎంచుకొని తమకు సమాచారమిస్తే అందుకు తగిన ఏర్పాట్లు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. పదో తరగతి కీలకమైంది కావడంతో నియత బోధనకు అంతరాయం కలగకుండా అదనపు సమయంలో వృత్తివిద్య నేర్పిస్తారు. పాఠ్యాంశాల బోధనతో పాటు ప్రయోగాలు కూడా నిర్వహిస్తారు. వ్యవసాయానికి సంబంధించిన కోర్సుల్లో క్షేత్ర సందర్శన ఉంటుంది. స్థానికంగా అందుబాటులో ఉన్న వనరుల ఆధారంగా కోర్సులను ఎంపిక చేసే బాధ్యత ప్రధానోపాధ్యాయులదే.

ఎంపికైన ఉన్నత పాఠశాలలు

ఖమ్మం గ్రామీణం మండలంలో తెల్దారుపల్లి, గుదిమళ్ల, ఎంవీ పాలెం, ముత్తగూడెం, ఏదులాపురం, జలగంనగర్, తల్లంపాడు, పెద్ద వెంకటగిరి ఉన్నత పాఠశాలలు, ముదిగొండ మండలంలో మేడేపల్లి, చింతకాని-కొదుమూరు, పందిళ్లపల్లి, ఖమ్మం అర్బన్- గాంధీనగర్, నయాబజార్, కొత్తగూడెం, రోటరీనగర్, శాంతినగర్, ఖమ్మం, మామిళ్లగూడెం, రాజేంద్రనగర్, గాంధీనగర్, సత్తుపల్లి- కాకర్లపల్లి, కిష్టారం, బేతుపల్లి గంగారం, సత్తుపల్లి, ఎన్టీఆర్ నగర్, తల్లాడ-అన్నారుగూడెం, తల్లాడ, బిల్లుపాడు, ఎర్రుపాలెం-భీమవరం, మామునూరు, జమలాపురం, కామేపల్లి-పొన్నెకల్లు, పాత లింగాల, రఘునాథపాలెం-చిమ్మపూడి, రఘునాథపాలెం, వేపకుంట్ల, కూసుమంచి-నాయకన్‌గూడెం, మల్లేపల్లి, నేలకొండపల్లి-రాజేశ్వరపురం, రావిగూడెం, కల్లూరు-కల్లూరు, పేరువంచ, పెనుబల్లి-చింతగూడెం, కోండ్రుపాడు, వైరా-వైరా, బోనకల్లు-గోవిందాపురం, చిరునోముల, రావినూతల, బోనకల్లు, మధిర-మధిర, ఏన్కూరు మండలంలో తిమ్మారావుపేట, జన్నారం ఉన్నత పాఠశాలలు.

మణుగూరు ఉన్నత పాఠశాల, సారపాక, పాల్వంచ, బొల్లోరిగూడెం(పాల్వంచ), దమ్మపేట, కొర్రాజులగుట్ట ఉన్నత పాఠశాలను ఎంపిక చేశారు.

# శిథిల గోదాములకు మోక్షమెప్పుడో?

భూపాలపల్లి : ఒక గోదాము రెండు వైపులా గోడలు పడిపోయి పై కప్పు భాగం కూలి రెండేళ్లైంది. మరో గోదాము శిథిలావస్థకు చేరుకొని గోడలు పగుళ్లిస్తే సిమెంటు రాస్తూ కాలం వెళ్లదీస్తున్నారే తప్ప వాటి నిర్మాణం గురించి శ్రద్ధ చూపడం లేదు. గోదాముల వసతి కరవై రైతులు, వ్యాపారులు ఇక్కట్లకు గురవుతున్నారు. ఆదాయపరంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎనుమాముల మార్కెట్ తరువాత పెద్దది నర్సంపేట మార్కెట్. ఇక్కడకు డివిజన్‌లోని ఆరు మండలాల రైతులేగాక మహబూబాబాద్ జిల్లా గూడూరు, గంగారం, కొత్తగూడ మండలాల్లోని అటవీ గ్రామాల అన్నదాతలు వారి పంటల ఉత్పత్తులను తీసుకొచ్చి విక్రయిస్తారు. ఈమార్కెట్ లో మొక్కజొన్న, పత్తి, అపరాలు క్రయ విక్రయాలు జోరుగా సాగుతాయి. అన్నదాతలు పండించిన పంటల ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు పలకకుంటే ఖరీదుదారులు కొనుగోలు చేసిన పంటలను నిలువ చేసేందుకు గోదాముల్లేక ఇబ్బందులు పడుతున్నారు. వ్యాపారులు, రైతుల కోసమని 90వ దశకంలో ఒక్కో గోదాం 600మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో కూడిన రెండు గోదాములను వ్యవసాయ మార్కెట్ నిధులతో యార్డు ఆవరణలో నిర్మించారు. ఆ గోదాంల నిర్మాణంతో చాలా వరకు సరకుల నిల్వ సమస్యలు తీరాయి. కాల క్రమేణా సాగు విస్తీర్ణం పెరగడం పంటల దిగుబడులు పెరిగిన క్రమంలో ఈ గోదాముల సామర్థ్యం



సరిపోని పరిస్థితి ఏర్పడింది. పౌరసరఫరాల సంస్థ, వ్యవసాయ మార్కెట్ శాఖ నుంచి రెండు గోదాములు నిర్మించారు. కాని పీడీఎస్ బియ్యం, ఇతర సామగ్రికి ఉపయోగిస్తున్నారు. కర్షకులు పంటల నిల్వ చేసే అవకాశం లేకుండా పోయింది. గోదాముల వసతి లేక కొన్ని మార్లు ఖరీదుదారులు, వ్యాపారులు కవర్ షెడ్డు కింద సరకుల బస్తాలను నెలల తరబడి నిల్వ చేస్తున్నారు. ఆకస్మిక వానలకు తడవడంతో పాటు వరదకు పంట ఉత్పత్తులు కొట్టుకు పోవడం ఏటా ఆనవాయితీగా మారింది. రైతులు నష్టపోతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు ఏమీ పట్టించుకోక పోగా వరదకు కొట్టుకుపోకుండా జాగ్రత్తలు తీసుకోరా అంటూ వారినే దబాయిస్తున్నారు.

రెండేళ్లైనా పట్టింపేది


600 మెట్రిక్ టన్నుల పరిమాణం కలిగిన గోదాము రెండు వైపులా గోడలు పడిపోయి పైకప్పు భాగం పడిపోయినా పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడు. కూలిన గోదామును తొలగించి దాని స్థానంలో కొత్తది నిర్మించడమో, దానిని మరమ్మతు చేసి పునర్నిర్మాణం చేయాలనే ధ్యాస అధికారులకు కొరవడింది. రెండేళ్లుగా రైతులు, వ్యాపారులు తిప్పలు పడుతున్నా వారికి కనికరం లేకుండా పోయింది.

టెండర్ ప్రక్రియ పూర్తి..ప్రసాదరావు, మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి, నర్సంపేటగోదాంల మరమ్మతులకు మార్కెట్ శాఖ నుంచి రూ.4లక్షలు మంజూరు కాగా టెండరు ప్రక్రియ పూర్తయింది. త్వరలో పనులు ప్రారంభించి సకాలంలో పూర్తి చేసేలా చర్యలు చేపడుతాం.

# కలెక్టర్ ఆదేశించినా కదలిక లేదు

వేములవాడ : ఆధ్యాత్మిక పట్టణమైన వేములవాడలోని గుడిచెరువు అభివృద్ధి, సుందరీకరణ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. రాజన్న దర్శనానికి వచ్చే భక్తులకు ఆహ్లాదం పంచడంతోపాటు సేదతీరేందుకు అన్ని వసతులు కల్పించేందుకు రూ. 12 కోట్లతో ప్రణాళికలను సిద్ధం చేశారు. మూడు నెలల క్రితమే పనులు ప్రారంభించారు. రాష్ట్ర పర్యాటక శాఖ ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో పనులు కొనసాగుతున్నాయి. పనుల పురోగతిని కలెక్టర్ అనురాగ్ జయంతి పర్యవేక్షణ చేసి పనులు అక్టోబరు మొదటి వారంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినా ఫలితం లేదు.

వేములవాడలోని గుడి చెరువు సుందరీకరణ పనులను రెండు షిఫ్టుల్లో పనులు చేపట్టి వేగం పెంచాలని కలెక్టరు ఆదేశించారు. అయినా మందకొడిగా కొనసాగుతున్నాయి. గుడి చెరువు బండ్‌పై ఇప్పటికే సిమెంట్, సలాకతో వివిధ నిర్మాణాలకు సంబంధించిన ఆకృతులను సిద్ధం చేశారు. గత నెలలో వర్షాలు కొంత వరకు పనులకు అడ్డంకిగా మారడంతో అనుకున్నంత వేగంగా జరగడం లేదు. బతుకమ్మ పండగ లోపు నిర్మాణాలు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. అయినా పనుల్లో వేగం కనిపించడం లేదు. దీంతో గడువులోగా



సుందరీకరణ పనులు పూర్తయ్యే పరిస్థితులు కనిపించడం లేదు. మరోవైపు గుత్తేదారుకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో పనులు చేసేందుకు అంతగా ఆసక్తి చూపడం లేదని సమాచారం.

పూర్తయితే ఆహ్లాదం..వేములవాడ గుడి చెరువు బండ్‌పై పలు రకాల నిర్మాణాలు చేపట్టి ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్‌మెంట్ (వీటీఏడీఏ), రాష్ట్ర పర్యాటక శాఖ సంయుక్తంగా ప్రణాళికలు సిద్ధం చేశాయి. ఇందులో భాగంగా బండ్‌ను పూర్తిస్థాయిలో సుందరీకరణ చేసి కట్టపై పలు నిర్మాణాలు పూర్తి చేయనున్నారు. పలు విగ్రహాలు, బెంచీలు, గార్డెనింగ్, చిన్నారుల పార్కు, బండ్ పొడవునా విద్యుత్తు దీపాల ఏర్పాటు, నడక ట్రాక్, గుడి చెరువు బండ్‌కు ఇరువైపులా రెయిలింగ్, మొక్కలు ఏర్పాటుతో పాటు గుడి చెరువు మధ్యలో వాటర్ ఫౌంటెయిన్ తదితర నిర్మాణాలు చేపట్టనున్నారు. ఇప్పటికే వీటికి సంబంధించిన నిర్మాణాలు పురోగతిలో ఉన్నాయి. అగ్రిమెంట్‌లో మాత్రం ఏడాదిలోగా గుత్తేదారు పనులు పూర్తి చేయాలని ఉంది. గుడి చెరువు సుందరీకరణ పూర్తయితే పట్టణ ప్రజలతో పాటు రాజన్న దర్శనానికి వచ్చే భక్తులకు ఆహ్లాదం పంచడంతోపాటు ఆకర్షణగా నిలవనున్నది. పనులు వెంటనే పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు, భక్తులు కోరుతున్నారు.

పనులు పూర్తి చేసేందుకు చర్యలు- సుదర్శన్, డీఈ, పర్యాటక శాఖ వేములవాడ గుడి చెరువు బండ్ సుందరీకరణ పనులు అనుకున్న స్థాయిలో జరుగుతున్నాయి. వివిధ నిర్మాణాలు సాగుతున్నాయి. గుత్తేదారుకు బిల్లులు రావాల్సి ఉంది. ఒప్పందం ప్రకారం గడువులోగా పనులు పూర్తి చేస్తాం.

## సుప్రీంలో కేసు గెలిచిన సిద్ధార్థ లూథ్రా.. జగన్ సర్కార్‌కు ఎదురుదెబ్బ



న్యూఢిల్లీ : ఏపీ సీఎం వైఎస్ జగన్ రెడ్డి ప్రభుత్వానికి సుప్రీం కోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. టీడీపీ నేత ఆదిరెడ్డి అప్పారావుకు బెయిల్ రద్దు చేయడానికి సుప్రీం నిరాకరించింది. దీంతో ఏపీ ప్రభుత్వానికి ఊహించని రీతిలో షాక్ తగిలినట్లయ్యింది. జగత్ జనని చిట్ ఫండ్ కంపెనీలో అక్రమాలు ఆరోపణలతో ఆదిరెడ్డి అప్పారావు, ఆయన కుమారుడు ఆదిరెడ్డి వాసులను సీఐడీ అరెస్ట్ చేసింది. అయితే ఆదిరెడ్డి అప్పారావు, ఆదిరెడ్డి వాసులకు ఏపీ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. దీంతో హైకోర్టు తీర్పును సీఐడీ సుప్రీంలో సవాలు చేసింది. బుధవారం నాడు ఈ పిటిషన్‌పై సుప్రీంలో విచారణకు రాగా.. సీఐడీ తరపున న్యాయవాది నిరంజన్ రెడ్డి వాదనలను వినిపించారు. ఆదిరెడ్డి అప్పారావు తరపున సీనియర్ కౌన్సిల్ సిద్ధార్థ లూథ్రా హాజరయ్యారు. విచారణకు సహకరించాలని ఆదిరెడ్డి అప్పారావుకు సుప్రీం సూచించింది. విచారణకు సహకరిస్తారని సుప్రీంకు సిద్ధార్థ లూథ్రా హామీ ఇచ్చారు. దీంతో ఆదిరెడ్డి అప్పారావు బెయిల్ రద్దుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. లూథ్రా కేసు గెలవడంతో టీడీపీ శ్రేణులు, ఆదిరెడ్డి వీరాభిమానులు ఆనందంలో మునిగితేలుతున్నారు.

## చంద్రబాబుని జగన్, సజ్జల ఇబ్బందులకు గురిచేస్తున్నారు




రాజమండ్రి: రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్న చంద్రబాబును సీఎం జగన్, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి పర్యవేక్షిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని మాజీ ఎంపీ హర్షకుమార్ అన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన రాజమండ్రిలో మీడియాతో మాట్లాడుతూ ఆరోగ్య రీత్యా చంద్రబాబుని ఆసుపత్రిలో చేర్చి మెరుగైన చికిత్స అందించాలన్నారు. ముఖ్యమంత్రి కక్ష సాధింపు ధోరణి విడనాడాలన్నారు. చంద్రబాబుని జైలులో పెట్టిన తర్వాత ప్రజా సమస్యలపై ఎవరూ మాట్లాడటం లేదని, రాష్ట్ర సంపదను జగన్ దోచుకుంటున్నారని ఆరోపించారు. రాజోలు తీరప్రాంతం అంతా అసైన్డ్ భూములేనని, గత నెలలో సజ్జల వచ్చి అంతర్వేది ప్రాంతాన్ని పరిశీలించారని, ఒక సూట్ కేసు కంపెనీ భూములు కావాలని దరఖాస్తు చేసుకుందని హర్షకుమార్ అన్నారు. ఓఎన్జీసీకి చెందిన రెండు బావులను అభివృద్ధి చేసేందుకు 24.8 చదరపు కిలోమీటర్లలో ఆరు వేల ఎకరాలు కావాలని దరఖాస్తు చేసిందన్నారు. దీంతో కేశనపల్లిలో సొసైటీ భూములు ఇచ్చేందుకు రైతులు నిరాకరించారని, ఆరు వేల ఎకరాలు కట్టబెట్టేందుకు ప్రభుత్వం సిద్ధమైందన్నారు.

జగన్, సజ్జలకు చెందిన సూట్ కేసు కంపెనీకు భూములు కట్టబెట్టే కుట్ర చేస్తున్నారని, అన్ని సొసైటీలు కూడా భూములు ఇవ్వటానికి నిరాకరిస్తున్నాయన్నారు. రెండు ఎకరాల విస్తర్ణంలో ఉన్న బోరు బావుల కోసం ఆరు వేల ఎకరాలు భూములు బలవంతంగా లాక్కోవటం దుర్మార్గమని హర్షకుమార్ అన్నారు.

## చంద్రబాబును వెంటనే విడుదల చేయాలి : చింతా మోహన్




హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ ధీమా వ్యక్తం చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో ఇవాళ రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తున్నారని.. తెలంగాణలో 70 సీట్లకు తక్కువ కాకుండా కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందన్నారు. ఇక ఏపీలో చంద్రబాబు అరెస్టు విషయంపై ఆయన స్పందించారు. 'స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో ఆధారాలు లేకుండా అనుమానాలతోనే చంద్రబాబుపై కేసులు పెట్టారు. ఆయన్ను వెంటనే విడుదల చేయాలి. వైకాపా ప్రభుత్వం, జగన్ చేస్తున్న పనులను ఖండిస్తున్నాను' అని చింతామోహన్ అన్నారు.

**మార్గదర్శిపై చర్యలను ఖండిస్తున్నాం :** మార్గదర్శి, రామోజీరావులపై చేస్తున్న ఆరోపణలను చింతా మోహన్ ఖండించారు. '40 ఏళ్లుగా రామోజీరావు నాకు బాగా తెలుసు. రామోజీ సంస్థలపై జగన్ ప్రభుత్వం చేస్తున్న విమర్శలు సరికాదు. కావాలనే రామోజీరావుపై ఆరోపణలు చేస్తున్నారు. జగన్ ప్రభుత్వం ఏకపక్షంగా చేస్తున్న చర్యలను ఖండిస్తున్నా. భాజపా, వైకాపా కుట్ర వల్లే చంద్రబాబు జైలుకు వెళ్లారు. తెలంగాణతో పోలిస్తే ఏపీలో కక్షపూరిత రాజకీయాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ప్రతిపక్ష నాయకులకు ఎంత గౌరవం ఇస్తే.. మనకూ అంత గౌరవం పెరుగుతుంది. గతంలో జగన్‌ను నమ్మిన ఎస్సీలు.. ఇప్పుడు కాంగ్రెస్ వైపు చూస్తున్నారు' అని చింతా మోహన్ అన్నారు.

**విదేశాంగ విధానాన్ని మార్చాల్సిన అవసరం ఉంది :** మన విదేశాంగ విధానాన్ని మార్చాల్సిన అవసరం ఉందని చింతా మోహన్ అన్నారు. 'గాజాలో ఆస్పత్రిపై బాంబు వేయడం దారుణ అంశం. భారత్ శాంతిని మాత్రమే కోరుతుంది. యుద్ధాన్ని కాదు. ప్రధాని మోదీ ఇజ్రాయెల్ వైపు మాట్లాడటాన్ని ఖండిస్తున్నాం. ప్రస్తుత పరిస్థితులు మూడో ప్రపంచ యుద్ధానికి సూచికలుగా ఉన్నాయి. భారత విదేశాంగ విధానాన్ని మార్చాల్సిన అవసరం ఉంది' అని ఆయన పేర్కొన్నారు.

## 24న దసరా సెలవు.. ఉత్తర్వులు జారీ




అమరావతి: ఈ నెల 24న దసరా సెలవు ప్రకటిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాగా, ఏపీలోని పాఠశాలలకు అక్టోబరు 14 నుంచి 24 వరకూ దసరా సెలవులను ఖరారు చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. తిరిగి అక్టోబరు 25న పాఠశాలలు తెరుచుకుంటాయని పాఠశాల విద్యాశాఖ వెల్లడించింది. మొత్తం 11 రోజుల పాటు పాఠశాలలకు దసరా సెలవులు ఉంటాయని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. కాగా, ప్రయాణికుల సౌకర్యార్థం ఈ సారి విజయదశమి(దసరా) 5,500 ప్రత్యేక సర్వీసులను ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ నడుపుతోంది.

అక్టోబర్ 13వ తేదీ నుంచి 26వ దాకా ఈ సర్వీసులు అందుబాటులో ఉంటాయి. అంతేకాదు.. సాధారణ ఛార్జీలతోనే ఈ సర్వీసులను ఏపీఎస్ఆర్టీసీ నడిపిస్తోంది.


**ఎప్పుడు.. ఎక్కడి నుంచంటే..** 13 నుంచి 22 దాకా.. దసరా ముందు రోజులలో 2,700 బస్సుల్ని, అలాగే.. పండుగ దినాలైన 23వ తేదీ నుంచి 26 దాకా(పండుగ ముగిశాక కూడా) 2,800 బస్సుల్ని నడిపించనుంది. హైదరాబాద్ నుండి 2,050 బస్సులు, బెంగుళూరు నుండి 440 బస్సులు,చెన్నై నుండి 153 బస్సులువివిధపట్టణాలకు నడపబడతాయి. విశాఖపట్నం నుండి 480 బస్సులు, రాజమండ్రి నుంచి 355 బస్సులు, విజయవాడ నుండి 885 బస్సులు, అదే విధంగా రాష్ట్రంలోని ఇతర జిల్లాల నుండి వివిధ ప్రాంతాలకు/ పల్లెలకు/ నగరాలకు 1,137 ప్రత్యేక బస్సుల కేటాయింపుతో రద్దీని తట్టుకునే విధంగా ఏర్పాట్లు చేసింది.

## చంద్రబాబు అరెస్ట్ తీరు సరికాదు : బీజేపీ నేత భానుప్రకాష్ రెడ్డి



ఢిల్లీ : మాజీ సీఎం నారా చంద్రబాబు నాయుడు అరెస్ట్ వ్యవహారంలో బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరితో పాటు తాము స్పందించడం జరిగిందని ఏపీ బీజేపీ నేత భానుప్రకాష్ రెడ్డి తెలిపారు. చంద్రబాబు అరెస్ట్ తీరు సరికాదన్నారు. ఆయన ఆరోగ్యం పట్ల కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. అధికారులపై నమ్మకం సన్నగిల్లిందన్నారు. ఎయిమ్స్ వైద్యులతో ఆరోగ్యం చెక్ చేయించాలన్నారు. ఏపీలో దురదృష్టకరమైన పరిస్థితులు ఉన్నాయని భానుప్రకాష్ రెడ్డి అన్నారు. "రాష్ట్రంలో దిష్టిబొమ్మలు కాల్చినా కూడా కేసులు పెడుతున్నారన్నారు. ఏపీలో అరాచకం రాజ్యమేలుతోందన్నారు. "ఈ పాలన ఎక్కువ రోజులు రాష్ట్రంలో కొనసాగదు. ఏపీ ప్రభుత్వం కౌంట్ డౌన్ మొదలైంది. ఆంధ్రప్రదేశ్‌లో అరాచకం రాజ్యం ఏలుతుంది. దిష్టిబొమ్మలు తగులబెడితే బీజేపీ నేతలపై 307 సెక్షన్ కింద కేసులు పెడుతున్నారు. ఏపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏపీ ప్రజలు తీర్పు ఇవ్వబోతున్నారు. ఏపీలో ప్రతిపక్ష నేతపై అక్రమ కేసులు పెట్టి ఆయనను నిబంధనలకు వ్యతిరేకంగా అరెస్ట్ చేశారు" అని భానుప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు.

## భవాని భక్తులు విజయవాడకు రాకూడదని ఆంక్షలా?



విజయవాడ : విజయవాడ (గొల్లపూడి)లో దేవినేని ఉమ ఇంటి వద్ద ఉద్రిక్తత నెలకొంది. రైతాంగ సమస్యలపై అధికారుల దృష్టికి తీసుకువెళ్తానన్న దేవినేని ఉమను పోలీసులు అడ్డుకుంటున్నారు. ఆయనను బయటకు వెళ్ళనివ్వకుండా అడ్డుపడుతున్నారు. ఈ సందర్భంగా దేవినేని ఉమ మాట్లాడుతూ.. దసరా శరన్నవరాత్రులు జరుగుతున్నాయని.. ముఖ్యమంత్రి జగన్ ఏమి ఆలోచిస్తున్నాడని ప్రశ్నించారు. భవాని భక్తులు విజయవాడకు రాకూడదని ఆంక్షలా? అని నిలదీశారు. 10 లక్షల మంది భక్తులు వచ్చే విజయవాడ మహానగరంలో భయభ్రాంతులు సృష్టిస్తున్నారన్నారు. భక్తులను కాపాడాల్సిన పోలీసులను టీడీపీ నాయకులు కార్యకర్తల ఇళ్ల దగ్గర పెట్టి బలి పశువుల్ని చేస్తున్నారన్నారు. ఒక మూరు?డైన ముఖ్యమంత్రి చేసే తెలివి తక్కువ పనులకు మీరు బలవుతున్నారని పోలీసులను ఉద్దేశించి దేవినేని ఉమ అన్నారు. "రాజమండ్రి భువనేశ్వరి అమ్మగారిని కలవడానికి వెళ్తుంటే పోలీసులను అడ్డం పెడుతున్నారు. ఒక మాజీ మంత్రి, బీసీ నాయకుడు కొల్లు రవీంద్రను తల్లి వర్ధంతి కార్యక్రమం చేసుకోవడానికి కూడా వెళ్ళనివ్వడం లేదు. పంటలు ఎండిపోయి రైతులు ఆందోళన చెందుతున్నారు. వారికి ధైర్యం చెప్పి సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలి. మమ్మల్ని అడ్డుకోవడానికి మీకు ఏం అధికారం ఉంది? పోలీస్ కమిషనర్ వచ్చేసి తన పదవిని కాపాడుకోవడానికి సీఐ, ఎస్సై, కానిస్టేబుళ్లను అడ్డగోలుగా వాడుకుని అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారు.

నిన్న హైకోర్టులో అధికారులను సవాల్ చేస్తూ హెబియస్ కార్పస్ పిటిషన్ వేయడం జరిగింది. పోలీస్ అధికారులు అందరికీ కూడా నోటీసులు అందాయి. నోటీసు ఎవరు.. ఎందుకు జారీ చేస్తున్నారో చెప్పరు. లాక్కెళ్ళి 1 టౌన్ పోలీస్ స్టేషన్లో పడేస్తారు ఇది బాగా అలవాటయింది" అని దేవినేని ఉమ మండిపడ్డారు.




ఇజ్రాయెల్‌పై మెరుపుదాడి చేసి కొందరు పౌరులను బందీలుగా పట్టుకెళ్లిన హమాస్ గ్రూప్.. ఇప్పుడు వారిని విడిచిపెట్టేందుకు ఆఫర్ ఇచ్చినట్లు తెలుస్తోంది. అయితే ఇందుకోసం ఇజ్రాయెల్‌కు షరతు విధించినట్లు సమాచారం. గాజాలో బాంబు దాడులు ఆపితే బందీలందరినీ విడిచిపెట్టేస్తామని హమాస్ సీనియర్ అధికారి ఒకరు చెప్పినట్లు 'ఎన్‌బీసీ న్యూస్' కథనం వెల్లడించింది. 'గాజాలో ఇజ్రాయెల్ బలగాలు తమ సైనిక దురాక్రమణ, వైమానిక దాడులను నిలిపివేస్తే.. గంటలోనే మా వద్ద బందీలుగా ఉన్న ఇజ్రాయెల్, ఇతర దేశాల పౌరులను విడిచిపెడతాం. ప్రస్తుతం వారిని విడిచిపెట్టేందుకు సురక్షిత ప్రదేశం లేదు" అని హమాస్ సీనియర్ అధికారి చెప్పినట్లు ఆ కథనం పేర్కొంది. ఆ అధికారి ఎవరనేది మాత్రం వెల్లడించలేదు. అక్టోబరు 7న ఇజ్రాయెల్‌పై రాకెట్లతో విరుచుకుపడిన హమాస్.. తర్వాత ఆ దేశంలోకి చొరబడి భీకర దాడులకు పాల్పడిన విషయం తెలిసిందే. ఈ దాడుల్లో కొంతమందిని హమాస్ కిడ్నాప్ చేసి వారిని గాజాలో బంధించింది. హమాస్ చెరలో దాదాపు 200 మంది బందీలుగా ఉన్నట్లు ఇటీవల 'ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్' ధ్రువీకరించింది. మరోవైపు, హమాస్ నెట్‌వర్క్‌ను లక్ష్యంగా చేసుకుని గాజాపై ఇజ్రాయెల్ వైమానిక దాడులతో విరుచుపడింది. దీంతో అక్కడి పరిస్థితి అల్లకల్లోలంగా మారింది.

ఈ క్రమంలోనే గాజాలో మంగళవారం ఓ ఆసుపత్రి వద్ద భీకర పేలుడు సంభవించింది. ఈ ఘటనకు ఇజ్రాయెల్ కారణమని హమాస్ ఆరోపించగా.. దాన్ని ఐడీఎఫ్ ఖండించింది. పీఐజే ఉగ్ర సంస్థ ప్రయోగించిన రాకెట్ గురితప్పి ఆసుపత్రిపై పడిందని పేర్కొంటూ వీడియోలు కూడా విడుదల చేసింది.




విశాఖ: తెదేపా అధినేత చంద్రబాబు హయాంలో దసరా, దీపావళి, రంజాన్ లాంటి ముఖ్యమైన పండుగలకు వారం ముందే ఉద్యోగులు జీతాలందుకునేవారని తెదేపా ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. అలాంటి పరిస్థితి నుంచి 'జగనన్నా పండగొస్తోంది.. మా జీతాలన్నా.. మమ్మల్ని కరుణించన్నా' అనేలా ప్రస్తుత పరిస్థితులు ఉన్నాయని విమర్శించారు. అమ్మో ఒకటో తారీఖు అనేది పాత మాట అని.. ఇప్పుడు ఆ తేదీనే మర్చిపోయిన రోజులు వచ్చాయన్నారు. వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఒకటో తేదీన జీతాలు పడిన సంఘటనలు అరుదుగా ఉన్నాయన్నారు. ఈ మేరకు వైకాపా ప్రభుత్వ పాలనపై ట్విటర్ (ఎక్స్) వేదికగా గంటా విమర్శలు చేశారు. "గతంలో ఉద్యోగులు, పెన్షనర్లకు ఒకటో తేదీ ఉదయాన్నే జీతం పడినట్లు మెసేజ్ వచ్చేది. జగనన్న వచ్చాక ఈ లెక్క మారిపోయింది. జీతం ఎప్పుడు వస్తుందో తెలియదు.. ఏ తేదీన వస్తుందో తెలియదు.. అంతా అయోమయం జగన్మాయగా మారిపోయింది. నెల నెలా ఈఎంఐలు ఎలా చెల్లించాలో తెలియక ఉద్యోగులు లబోదిబో మంటున్నారు. 2019లో రాష్ట్రానికి జరగకూడని నష్టమే జరిగిపోయింది. ఆంధ్రప్రదేశ్ ఉద్యోగుల పరిస్థితి మింగలేక.. కక్కలేక.. అనేలా తయారైంది. రాష్ట్రంలోని విద్యావంతులు ఆలోచించాలి. విజన్‌కు ఉన్న విలువ.. విధ్వంసం తెచ్చే వినాశనం ఏంటో ఇప్పటికే అర్థమై ఉంటుంది.
2024లో ఏపీ భవిష్యత్‌కు మీరు దిక్సూచిలా ముందుండాలి. రాష్ట్రాన్ని రక్షించుకోండి" అని గంటా శ్రీనివాసరావు ట్వీట్ చేశారు.

## 139 వర్గాలుగా ఉన్న బీసీల కులగణన జరగాల్సి ఉంది




అమరావతి: 139 వర్గాలుగా ఉన్న బీసీల కులగణన జరగాల్సి ఉందని, జనగణన ప్రక్రియలో కులగణన చేయాలని కేంద్రాన్ని కోరుతూ అసెంబ్లీలో తీర్మానం కూడా చేశామని, అది ప్రస్తుతం జరిగే అవకాశం లేదని స్పష్టమవుతోందని మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల్ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన అమరావతిలో మీడియాతో మాట్లాడుతూ ఏపీలో రాష్ట్ర ప్రభుత్వమే బీసీల కులగణన చేయాలని నిర్ణయించామని, దీనిపై సంక్షేమ శాఖల ఉన్నత అధికారులతో ఒక కమిటీ నియమించామని చెప్పారు. సంఖ్యా పరంగా ఎంత మంది ఉన్నారని ఆయా బీసీ వర్గాల వారు తెలుసుకోవడం అవశ్యకమని, దీనికి కులగణన ఒక్కటే మార్గమని మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల్ అన్నారు. బీసీల కులగణనలో గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్ల సేవలను వినియోగించుకుంటామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా బీసీ కుల సంఘాల నేతలతో విజయవాడ, విశాఖ, తిరుపతి, రాజమహేంద్రవరం, కర్నూలులలో సమావేశాలు నిర్వహిస్తామన్నారు. ఈ కులగణన ఎన్నికల కోసం కాదని, మిగిలిపోయిన బీసీ వర్గాలకు ప్రత్యేక పథకాలు అవసరమని మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల్ పేర్కొన్నారు.

## కొల్లు రవీంద్ర పట్ల ప్రభుత్వ వైఖరి నన్ను ఎంతో బాధించింది: నారా భువనేశ్వరి



అమరావతి: తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలపై పోలీసుల నిర్బంధం తీవ్ర ఆవేదన కలిగిస్తోందని నారా భువనేశ్వరి పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె ట్వీట్ చేశారు. తల్లి వర్ధంతి కార్యక్రమానికి కూడా వెళ్లనీయకుండా ఒక మాజీ మంత్రిని అడ్డుకోవడం.. దేశంలో మరెక్కడైనా ఉంటుందా?అని ప్రశ్నించారు. "ఇదేమి చట్టం.. ఇదెక్కడి న్యాయం? కొల్లు రవీంద్ర పట్ల ప్రభుత్వం అనుసరించిన వైఖరి నన్ను ఎంతో బాధించింది. వ్యవస్థలు నిర్వీర్యం అవుతున్నాయని చంద్రబాబు ఎందుకు ఆందోళన వ్యక్తం చేసేవారో ఈ ఘటన చూస్తే అర్థం అవుతుంది. కుటుంబ వ్యవహారాలను, వ్యక్తిగత హక్కులను, సంప్రదాయాలను రాజకీయాలతో ముడి పెట్టవద్దు" అని ఉన్నతాధికారులను భువనేశ్వరి కోరారు.

## కొల్లు రవీంద్ర నిర్బంధం.. పూర్తి వివరాలతో కౌంటర్ వేయాలని హైకోర్టు ఆదేశం

అమరావతి: మాజీ మంత్రి కొల్లు రవీంద్రను అక్రమంగా నిర్బంధించారంటూ.. ఆయన సతీమణి నీలిమ వేసిన హెబియస్ కార్పస్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ జరిగింది. పిటిషనర్ తరపున దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపించారు. కొల్లు రవీంద్రను పోలీసులు కొన్ని గంటలపాటు అక్రమంగా నిర్బంధించారన్నారు. అయితే, కొల్లు రవీంద్రపై కేసు నమోదు చేసినట్లు హైకోర్టుకు పోలీసులు తెలిపారు. నోటీసులు ఇచ్చేందుకు ప్రయత్నించినా ఆయన తీసుకునేందుకు నిరాకరించారన్నారు.

దీంతో పెద్దనేరాలకే 151 నోటీసు ఇవ్వాలి కదా అని పోలీసులను ఈ సందర్భంగా న్యాయస్థానం ప్రశ్నించింది. పూర్తి వివరాలతో కౌంటర్ వేయాలని ఆదేశించింది. దసరా సెలవుల తర్వాత దీనిపై విచారణ చేస్తామని హైకోర్టు పేర్కొంది.

## చంద్రబాబు అనుభవం.. పవన్ ఆలోచన రాష్ట్రానికి అవసరం

అంబేద్కర్ కోనసీమ జిల్లా: తెలుగుదేశం అధినేత చంద్రబాబు సుదీర్ఘ అనుభవం, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఆలోచన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఎంతో అవసరమని జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ వ్యాఖ్యానించారు. బుధవారం అంబేద్కర్ కోనసీమ జిల్లా, కొత్తపేట నియోజకవర్గంలో పర్యటించిన ఆయన మీడియాతో మాట్లాడుతూ రెండు నాయకత్వాలు కలసి రాష్ట్ర భవిష్యత్ కోసం ఉమ్మడి ప్రణాళికను సిద్ధం చేసుకొని ముందుకు వెళ్ళబోతున్నామన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విముక్త ఆంధ్రప్రదేశ్ కోసం ప్రజలందరూ కంకణం కట్టుకున్నారని, రెండు పార్టీల కలయిక ద్వారా ఏపీలో ఇంకా మెరుగైన అభివృద్ధి తీసుకొచ్చే విధంగా కృషిచేస్తామని స్పష్టం చేశారు. త్వరలో ఉమ్మడి ప్రణాళికతో టీడీపీ, జనసేన ఇంటింటికీ వెళ్ళే కార్యక్రమం చేపడతామన్నారు. కొత్తపేట మండలం అల్లపల్లివారిపాలెం, వానపల్లి గ్రామాలలో ప్రమాదవశాత్తు మృతి చెందిన ఇద్దరు జనసేన పార్టీ కార్యకర్తలకు రూ. 5 లక్షల ప్రమాద భీమా చెక్కులను నాదెండ్ల మనోహర్ అందజేశారు.



## తడిసిన అందాలతో ప్రియా ప్రకాశ్ వయ్యారాల వల

కొంటెగా కన్నుగీటి ఓవర్‌నైట్‌లోనే స్టారైన మలయాళీ ముద్దుగుమ్మ ప్రియా ప్రకాశ్ వారియర్ అనతికాలంలోనే ఎక్కువమంది అభిమానులను సొంతం చేసుకున్నారు. సౌత్ ఇండస్ట్రీలో గ్లామర్ బ్యూటీగా మంచి గుర్తింపు దక్కించుకున్న ప్రియా ప్రకాశ్.. ప్రస్తుతం హిందీలో వరుస చిత్రాల్లో చేస్తున్నారు. సోషల్ మీడియాలోనూ హాట్ ఫొటోస్‌తో కవ్వించే ఈ ముద్దుగుమ్మ తాజాగా ట్రెడిషనల్ లుక్‌లో తడిసిన అందాలతో హీట్ పుట్టించేసింది. ఈ ముద్దుగుమ్మ తెలుగులోనూ పలు సినిమాల్లో నటించంది. కానీ ఈమెకు అదృష్టం కలిసి రాక ఇంత వరకు సరైన హిట్ అందుకోలేదు. చెక్, ఇష్క్ : నాట్ ఏ లవ్ స్టోరీతో పాటు ఇటీవలే పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ బ్రో



సినిమాలో సాయి ధరమ్ తేజ్ చెల్లెలి పాత్రలో కనిపించి ఆకట్టుకుంది. ఇతర భాషల్లోనూ చాలానే చిత్రాలు చేసింది. మలయాళంలో '4 ఇయర్స్', 'లైవ్', 'కొళ్ల', 'సుభద్రహరణం' వంటి సినిమాల్లో తనదైన నటనతో ఆకట్టుకుంది. ముఖ్యంగా హిందీలో కాస్త జోరు చూపిస్తోంది. 'యారియాన్ 2' చిత్రంతో ఆరంగేట్రం చేసిన ఈమె.. మూడు చిత్రాలను లైన్‌లో పెట్టింది. హిందీలో 3 మంకీస్, లవ్ హ్యాకర్స్, శ్రీదేవి బంగ్లా అనే సినిమాలు చేస్తోంది. కన్నడలోనూ విష్ణుప్రియా అనే చిత్రం చేస్తోంది. సోషల్ మీడియాలోనూ ఈ ముద్దుగుమ్మ మొదటి నుంచి స్టన్నింగ్ హాట్ ఫొటోషూట్లు చేస్తూ కవ్విస్తుంటుంది. ట్రెండీ వేర్ ఔట్ ఫిట్లలో యూత్‌ను బాగా ఆకర్షిస్తుంటుంది. ఫ్యాషన్ సెన్స్ బాగుంటుంది. తాజాగా ఈ బ్యూటీ చీరకట్టులో ట్రెడిషనల్ ఫొటోషూట్ చేసింది. క్రీమ్ కలర్ చీరను ధరించి... నదిలో జలకాలాడుతూ ఫొటోలకు పోజులిచ్చింది. ఒంపుసొంపులతో మెస్మరైజ్ చేసింది. నడుము అందాలను హైలైట్ చేస్తూ బాగా కవ్వించింది. తడి అందాలతో ఆమెను చూసిన నెటిజన్లు, ఫ్యాన్స్ పోజులు అదిరాయి అంటూ విపరీతంగా కామెంట్లు చేస్తున్నారు. ఆ పిక్స్‌ను తెగ షేర్ చేస్తూ ఆస్వాదిస్తున్నారు. హార్ట్, లవ్ అండ్ హాట్ ఎమోజీలతో కామెంట్ సెక్షన్‌ను నింపేస్తూ ట్రెండ్ చేస్తున్నారు.

## నెలకో సినిమా.. కష్టాలు చెప్పుకున్న శ్రీలీల

గ్లామరస్ బ్యూటీ శ్రీలీల ఏ మాయ చేసిందో కానీ మొదటి సినిమాతోనే కుర్రాళ్ళ మనసును దోచుకున్న విధానం ఇండస్ట్రీలో హాట్ టాపిక్ గా మారిపోయింది. దీంతో దర్శక నిర్మాతలు ఇప్పుడు ఆమె డేట్స్ కోసం గట్టిగానే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇక డిమాండ్ ను బట్టి మొదటి సినిమా తర్వాత ఈజీగా కోటి రూపాయల పారిపోషకం అందుకుంటోంది. ఇక ఇప్పుడు రాబోయే రోజుల్లో ఆ లెక్క మరింత పెరిగే అవకాశం కూడా ఉంది. ఇక ప్రస్తుతం అయితే అమ్మడి టైమ్ గట్టిగా నడుస్తుంది అని చెప్పవచ్చు. ఎవరికీ లేనన్ని ఆఫర్లు ఇప్పుడు తెలుగు ఇండస్ట్రీలో శ్రీలీలకు దక్కుతున్నాయి. అగ్ర హీరోలు మాత్రమే కాకుండా చిన్న హీరోలు కూడా ఈ బ్యూటీతో జోడి కట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఈ ఏడాదిలో అయితే ఆమెకు అసలు గ్యాప్ లేకుండా ఆఫర్స్ వస్తున్నాయి. ఇక శ్రీలీల కూడా తనకు నచ్చిన సినిమాలు చేసుకుంటూ ముందుకు వెళుతోంది. బాలయ్యతో చేసిన



భగవంత్ కేసరి సినిమా రాబోతోంది. ఈ సినిమాపై అంచనాలు గట్టిగానే ఉన్నాయి. స్కంద సినిమాతో కాస్త నిరాశపరచినప్పటికీ కూడా ఈ సినిమాతో మళ్ళీ ట్రాక్ లోకి రావాలి అని అనుకుంటుంది. ఇక రాబోయే రోజుల్లో అమ్మడు ఆది కేశవ, ఎక్స్ ట్రా ఆర్డినరి మ్యాన్, గుంటూరు కారం, ఉస్తాద్ భగత్ సింగ్, అనగనగా ఒక రాజు.. అనే సినిమాలతో కూడా ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే నెలకు ఒక సినిమాతో నెక్స్ట్ స్క్రీన్ పై కనిపిస్తున్న ఈ బ్యూటీ మాత్రం చాలా ఒత్తిడినే తట్టుకుంటున్నట్లు తెలుస్తోంది. భగవంత్ కేసరి సినిమాకు సంబంధించి ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె ప్రస్తుతం తన పరిస్థితి గురించి ఊహించిన విధంగానే తెలియజేసింది. మీరు నటించిన సినిమా నెలకొకటి రిలీజ్ అవుతుంది. ఇది రేర్ రికార్డ్ కదా.. ఎలా ఎంజాయ్ చేస్తున్నారు. అని మీడియా నుంచి ఎదురైన ప్రశ్నకు ఆమె నవ్వుతూ సమాధానం ఇచ్చారు. "ఎంజాయ్ చేస్తున్నానా? మాకు ఎన్ని కష్టాలు ఉన్నాయో మీకేం తెలుసు. ఒకపక్క షూటింగ్ ఇంకో పక్క డబ్బింగ్ అలాగే మరో వైపు సాంగ్స్ షూట్ చేయాలి. నా పరిస్థితి మామూలుగా లేదు. ఇక బాలయ్య గారు వాళ్ళ నాన్న ఎన్టీఆర్ గురించి చెప్పారు. ఒక టైంలో ఎన్ని సినిమాలు చేసేవారో తెలుసుకున్నాను. ఇక వాళ్లతో పోలిస్తే మనం చేసేది నథింగ్ అనిపించింది. ఇక ఒకేసారి అన్ని సినిమాలు సెట్స్ పైకి వచ్చాయి. అందుకు లైన్ గా రిలీజ్ లు ఉంటున్నాయి.. అంతే.." అని శ్రీలీల వివరణ ఇచ్చింది.




## అక్కా-చెల్లిలా రాశీతో చందమామ!



అందాల బ్యూటీలు రాశీఖన్నా-కాజల్ అగర్వాల్ ఒకే చోట కలిస్తే లేడీ ఫాలోవర్స్ కి ఆ కిక్కే వేరుగా. సరిగ్గా అలాంటి సన్నివేశమే ఇది. ఇదిగో ఇక్కడిలో రాశీఖన్నా-కాజల్ జంటగా సెల్ఫీలు దిగారు. వారిద్దరి మధ్యలో కాజల్ గారాల కుమారుడు కూడా తోడయ్యాడు. భామామణులిద్దరు క్యాజువల్ గా షేర్ చేసుకున్న పిక్ ఇది. ఇద్దరు సింపుల్ దుస్తుల్లో ఉన్నారు.

అనుకోకుండా చోటు చేసుకున్న స్పాట్ లా ఉంది. ఇద్దరు అక్కా-చెల్లిలా చాలా క్లోజ్ గా ఈ పిక్ లో కనిపిస్తున్నారు. ఒకరిపై ఒకరు వాలిపోయి మరీ ఫోజులి చ్చారు. ప్రస్తుతం ఈ ఫోటో అంతర్జాలంలో వైరల్ గా మారింది. ఇద్దరు ఇలా కలిసి ఫోటో దిగిన సన్నివేశం ఇంతవరకూ చోటు చేసుకోలేదు. దీంతో హీరోయిన్ల ఇద్దరి అభిమానులు అక్కా-చెల్లి లా ఉన్నారంటూ కామెంట్లు పోస్ట్ చేస్తున్నారు. ఇక కెరీర్ పరంగా చూస్తే ఇద్దరు బిజీగా ఉన్నారు. కాజల్ అగర్వాల్ సెకెండ్ ఇన్నింగ్స్ లోనూ దూసుకుపో తుంది. తెలుగు లో మంచి అవకాశాలు అందుకుంటుంది. సీనియర్ హీరోలకు పర్ఫెక్ట్ ఛాయిస్ గా నిలుస్తుం ది. బాలయ్యతో నటించిన భగంవత్ కేసరి త్వరలో రిలీజ్ అవుతుంది. ఇది హిట్ అయితే కాజల్ కి మైలేజ్ రెట్టింపు అవుతుంది. కొత్త అవకాశాలు మరిన్ని వరిస్తాయి. ఇండియన్ - 2లోనూ నటిస్తుంది. ఇదే కాజల్ తొలిపాన్ ఇండియా చిత్రం.

హిందీలో కొన్ని సినిమాలు చేసింది గానీ అక్కడ ఆశించినంతగా కెరీర్ సాగలేదు. ఇక రాశీఖన్నా కోలీవుడ్ లో బిజీ అవుతుంది. తెలుగు అవకాశాలు తగ్గడంతో అమ్మడు రెండేళ్లగా అక్కడే ఎక్కువ సినిమాలు చేస్తోంది. హిందీలోనూ ప్రయత్నాలు చేస్తుంది. అయితే అక్కడంత సీరియస్ గా ముందుకెళ్లలేదు. తమిళ్ నే మెయిన్ టార్గెట్ చేసినట్లు కనిపిస్తోంది. అక్కడ అభిరుచికి తగ్గట్టు మౌల్డ్ చేసుకుంటుం ది. లుక్ పరంగానూ కొన్ని రకాల మార్పులు తీసుకొస్తుంది.

## మీరా జాస్మిన్.. చిట్టి గౌనులో స్టన్నింగ్ అందాలు



చేసింది ఎక్కువగా తమిళ్ మలయాళం సినిమాలే అయినప్పటికీ కూడా మీరా జాస్మిన్ తెలుగు ఇండస్ట్రీలోని మర్చిపోలేని గుర్తింపును అందుకుంది. ఇక బాక్సాఫీస్ వద్ద ఆమెకు అగ్ర హీరోలతో అవకాశాలు దక్కిన సందర్భాలు కూడా చాలా తక్కువ. ముఖ్యంగా రవితేజ భద్ర సినిమాతో ఆమెకు మంచి క్రేజ్ దక్కింది. ఇక పవన్ కళ్యాణ్ గుడుంబా శంకర్ లో కూడా హీరోయిన్గా నటించిన మీరాజాస్మిన్ అప్పట్లో మాత్రం హెూమ్లీ హీరోయిన్ గా కనిపించింది. హీరోయిన్ గా 2010 వరకు ఎంతో బిజీగా కనిపించినా ఆమె ఎనాడు గ్లామర్ డోస్ మాత్రం పెంచలేదు. వీలైనంతవరకు ఎక్కువగా చుడిదార్ చీరలలోనే కనిపించేది. అయితే హీరోయిన్గా ఆమెకు అవకాశాలు తగ్గిన తర్వాత మళ్లీ సెకండ్ ఇన్నింగ్స్ లో ఊహించిన విధంగా దర్శనమిస్తోంది. ప్రస్తుతం ఆమె వయసుకు తగ్గ పాత్రలు చేస్తున్నప్పటికీ సోషల్ మీడియాలో మాత్రం అందుకు భిన్నంగా కనిపిస్తోంది. మీరా జాస్మిన్ గ్లామరస్ ఫోటోలు చూస్తే ఎవరైనా సరే షాక్ అవ్వాల్సిందే. ఇక రీసెంట్ గా అమ్మడు మరోసారి చిట్టి గౌనులో దర్శనమించింది. అమెరికాలో ఉన్న మీరజాస్మిన్ అక్కడ నగరం వీధుల్లో సరదాగా ఎంజాయ్ చేస్తూ కనిపించింది. ఇక ఆ ఫోటోలలో ఆమె చిన్న గౌనులో ఇచ్చిన స్టిల్స్ మాత్రం మామూలుగా లేవు. అలాగే తన ఎద అందాలతో కూడా ఆమె ఎంతగానో మైమరిపించింది. ఇక ప్రస్తుతం ఆ ఫోటోలు అయితే సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. గతంలో కూడా ఆమె గ్లామరస్ స్టిల్స్ తో బాగానే ఎట్రాక్ట్ చేసింది.

కానీ ఈ ఫోటోలు మాత్రం అంతకుమించి అనేలా ఉన్నాయి అంటూ ఫాలోవర్స్ పాజిటివ్ గా రియాక్ట్ అవుతున్నారు. ఇక ఈ బ్యూటీ చేతిలో అయితే ప్రస్తుతం తమిళ్ మలయాళంలో రెండు సినిమాలు ఉన్నాయి. అలాగే తెలుగులో కూడా మరో సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లుగా తెలుస్తోంది. ఇక అవకాశం వస్తే ఐటెం సాంగ్స్ లో కూడా చేయాలని ఆలోచనతో ఉన్నట్లు టాక్. కానీ ఇప్పటివరకు మాత్రం ఆ రూట్లో ఈ బ్యూటీకి సరైన అవకాశాలు రాలేదు.

## షార్ట్ టాప్‌లో అల్ట్రా స్టైలిష్ అనసూయ


యాంకర్ కమ్ యాక్టర్ అనసూయ ప్రస్తుతం ఇండస్ట్రీలో హాట్ గ్లామర్‌కు కేరాఫ్ అడ్రెస్‌గా మారుతోంది. తన పరువాలతో గిలిగింతలు పెడుతోంది. కొంచెం లేటుగా వచ్చినా.. ఓ వైపు క్యారెక్టర్ రోల్స్ చేస్తూనే మరోవైపు సోషల్ మీడియాలో మాత్రం గ్లామరస్ పోజిలిస్తూ కవ్విస్తోంది. తాజాగా ఆమె అల్ట్రా స్టైలిష్ లుక్‌లో షార్ట్ టాప్?లో ఫోటోషూట్ చేసి టెంపరేచర్ పెంచేసింది. వివరాల్లోకి వెళితే.. జబర్దస్ షో ద్వారా పాపులర్ అయిన ఈమె.. యాక్టింగ్ అండ్ యాంకరింగ్ స్కిల్స్‌తో తక్కువ సమయంలోనే స్టార్‌గా ఎదిగిపోయింది. కెరీర్ ఆరంభంలో టెలివిజన్ రంగానికే పరిమితమైన ఈమె .. ఆ తర్వాత సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చి దూసుకెళ్తోంది. అయితే ప్రస్తుతం యాంకరింగ్‌ను ఆపేసి.. వరుసగా సినిమాలను చేస్తోంది. కెరీర్‌లో ఫుల్ బిజీగా గడుపుతోంది. రీసెంట్‌గా ఆమె నటించిన 'పెద్ద కాపు', 'ప్రేమ విమానం' చిత్రాలు ప్రేక్షకుల ముందుకు వచ్చాయి. దీంతో ఆమె సినిమాల్లో నటిస్తూనే ప్రమోషన్స్‌లో పాల్గొంటోంది.



జయాపజయాలతో సంబంధం లేకుండానే ఆమెకు అవకాశాలు కూడా క్యూ కడుతున్నాయి. ఈ ఏడాది 'మైఖేల్', 'రంగమార్తాండ', 'విమానం'తో పాటు 'పెద్ద కాపు', 'ప్రేమ విమానం' చిత్రాలతో అలరించిన ఈమె.. ప్రస్తుతం 'ఫ్లాష్ బ్యాక్', 'పుష్ప 2' చిత్రాల్లో నటిస్తోంది. వీటితో పాటే మరిన్ని చిత్రాల్లో నటంచేలా చర్చలు జరుపుతోంది. సినిమాలతో పాటే సోషల్ మీడియాలో ఫొటోషూట్స్‌ను రచ్చ చేస్తుంటుంది. తనపై విమర్శలు చేసేవారికి గట్టి కౌంటర్లు కూడా ఇస్తుంటుంది. తాజాగా అదిరిపోయే అల్ట్రా స్టైలిష్ ఫొటోషూట్‌లో పాల్గొంది. పింక్ కలర్ షార్ట్ షర్ట్, యాష్ కలర్ ప్యాంట్ ధరించి కూలింగ్ గ్లాస్‌లు పెట్టుకుని స్టైలిష్?గా కూల్ పోజులిచ్చింది. ఎంతో కూల్? అండ్ స్మైల్ లుక్స్ ఇచ్చింది. స్టైలిష్ హ్యాండ్ బ్యాగ్ తగిలించుకుంది. తన పెట్? కూడా కలిసి కొన్ని ఫొటోలు దిగింది. ఒక్కో ఫొటోలో ఒక్కోలా పోజులిచ్చింది. కూర్చొని, నిల్చొని, సైడ్ యాంగిల్‌లో ఫొటోలు దిగింది. మొత్తంగా ఈ పిక్స్ ఎంతో సాలిడ్‌గా ఉన్నాయంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు.

## కేసీఆర్ టైటిల్.. జబర్దస్త్ కమెడియన్ సర్ ప్రైజ్!

జబర్దస్త్ షోతో పాపులర్ అయిన హాస్యనటుడు రాకింగ్ రాకేశ్. తనని తాను ప్రూవ్ చేసుకుంటూ బుల్లితెర ప్రేక్షకుల్లో పాపులారిటీ సంపాదించుకున్న ఆయన కెరీర్‌లో మరో అడుగు వేసి హీరోగా మారబోతున్నారు. ఆయన కథానాయకుడిగా ఓ చిత్రం తెరకెక్కబోతున్న సంగతి తెలిసిందే. తెలంగాణలోని బంజారా బ్యాక్‌డ్రాప్‌లో సినిమా రూపుదిద్దుకుంటోంది. గరుడవేగ అంజి డీఓపీ అందించడంతో పాటు దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ సినిమా ఫస్ట్ లుక్? అండ్ టైటిల్ పోస్టర్‌ను విడుదల చేసింది మూవీ టీమ్. తెలంగాణ మంత్రి సి. మల్లా రెడ్డి దీన్ని రిలీజ్ చేశారు. సినిమాకు కేసీఆర్(కేశవ చంద్ర రామ్‌వత్) అనే టైటిల్‌ను ఖరారు చేశారు మేకర్స్. పోస్టర్?లో తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ భారీ కటౌట్ ముందు ఓ బాలుడు నిల్చొని తదేకంగా చూస్తున్నట్లు చూపించారు. అలానే పోస్టర్ బ్యాక్‌గ్రౌండ్‌లో రైతులు, బంజారా మహిళలు, గొర్రెలు, పచ్చనీ పొలాలు.. ఇలా చాలా కనిపిస్తున్నాయి. మొత్తంగా గ్రామీణ




వాతావరణం, తెలంగాణ సంస్కృతి పోస్టర్‌లో ఉట్టిపడుతోంది. సీఎం కేసీఆర్ అడ్వైసర్ దేశపాటి శ్రీనివాస్, పెద్దింటి అశోక్.. సినిమాకు కొన్ని కీలక సన్నివేశాలను అందించారు. నవీన్ కోలా - రాకింగ్ రాకేశ్ సినిమాకు స్క్రిప్ట్ రైటర్స్‌గా కూడా వ్యవహరించారు. కుశుమ రాజ్‌కుమార్ - ఉంద్రవెల్లి నాగరాజ్ డైలాగ్స్ అందించారు. పాపులర్ క్యారెక్టర్ ఆర్టిస్ట్ సత్య కృష్ణ కూతురు అనన్య మేనన్ హీరోయిన్‌గా ఈ చిత్రంతో అరంగేట్రం చేస్తోంది. ఇంకా సినిమాలో తనికెళ్ల భరణి, కృష్ణ భగవాన్, జోర్దార్ సుజాత, ధనరాజ్, తాగుబోతు రమేశ్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. గ్రీన్ ట్రీ ప్రొడక్షన్స్ - విభూది ఎంటర్‌టైన్మెంట్స్ - గరుడవేగ మేకింగ్స్.. కలిసి సంయుక్తంగా సినిమాను నిర్మిస్తున్నాయి. రాకింగ్ రాకేశ్ నిర్మాతగానూ వ్యవహరిస్తున్నారు. సినిమాకు తెలంగాణ మ్యాస్ట్రో చరణ్ అర్జున్ సినిమాకు సంగీతం అందిస్తున్నారు. బలగం మధు ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు. కాశర్ల శ్యామ్, గోరేటి వెంకన్న, చరణ్ అర్జున్ పాటలకు లిరిక్స్ అందిస్తున్నారు. చూడాలి మరి ఈ సినిమా ఎలాంటి రిజల్ట్‌ను అందుకుంటుందో....

